ఆంధ్రజ్యోతి

20 పేజీలు

సిద్దిపేట



ఆదివారం 13 ఆగస్టు 2017



నాటుకోడి..

కేరాఫ్ తిరుపతి

పౌల్ట్రీ ఫాం అంటే అందరికీ గుర్తొచ్చేది బాయిలర్ కోళ్లే. అందులో లాభాలు అంతంతమాత్రమే. కానీ రేగొండ రైతు తిరుపతి జనాల నాడీ పట్టాడు. నాటు కోడికి జై కొట్టాడు. రాజశ్రీ రకం కోళ్లను పెంచుతున్నాడు. మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఉండడంతో లాభాల బాటలో పయనిస్తున్నాడు.

▶ సెంటర్ స్ప్రెడ్‌లో





మెదక్ లోక్‌సభకు

పద్మినీ దామోదర్

- పటాన్‌చెరు అసెంబ్లీకి రాములమ్మ !
- సిద్దిపేట స్థానానికి కొత్త అభ్యర్థి
- గజ్వేల్ బరిలోకి బలమైన నేత
- మిగతా స్థానాల్లో పాతకాపులే
- గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రణాళికలు
- అధికార పార్టీకి దీటుగా అభ్యర్థుల ఎంపిక వ్యూహం!

4



సభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఇది ఇర్కోడు

విజయం

- ఇక్కడి అభివృద్ధితో ఎనలేని సంబురం
- రాష్ట్రంలోనే తొలి సామూహిక గొర్రెల షెడ్ ప్రారంభించుకోవడం సంతోషకరం
- భవిష్యత్ కోసం మొక్కలను పెంచాలి
- పేదల ఆరోగ్యంపై సర్కారు ప్రత్యేక దృష్టి
- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిని కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దాం
- ఇక్కడే అమెరికా తరహా వైద్యం అందించాలనే లక్ష్యం
- భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

5



చిన్నగుండవెల్లిలో సర్పంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కర్టెన్‌ను చూసి సంతోషం వ్యక్తం చేసిన మంత్రి హరీశ్‌రావు

నేటి నుంచి దౌలాపూర్‌లో భూముల రీ సర్వే

- పైలట్ ప్రాజెక్ట్‌గా గ్రామం ఎంపిక
- సుదీర్ఘ భూ సమస్యలకు పరిష్కారం
- రైతుల కబ్జాకు చట్టబద్ధత
- కమతాల ఏకీకరణకు మార్గం సుగమం
- గ్రామానికి చేరుకున్న అధికారుల బృందం



రీ సర్వేపై దౌలాపూర్ గ్రామస్థులకు సూచనలిస్తున్న తహసీల్దార్ నాగమణి

5 లో

'స్వచ్ఛ'త సగమే !

- నామమాత్రంగా స్వచ్ఛ వారోత్సవాలు
- ఈనెల 9న ప్రారంభం
- నాలుగు రోజులు పూర్తి
- జరిగిన కార్యక్రమాలు అంతంత మాత్రమే
- మిగిలినవి మూడు రోజులే



స్వచ్ఛ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

20 లో

ఇంటర్వ్యూ



ఆరోగ్య సమాజ నిర్మాణానికి

యునిసెఫ్ కృషి

● యునిసెఫ్ ప్రత్యేక ప్రతినిధి దీపక్‌కుమార్‌దే

జగదేవ్‌పూర్: ఆరోగ్య సమాజ నిర్మాణానికి యునిసెఫ్ కృషి చేస్తుందని యూనిసెఫ్ ప్రత్యేక ప్రతినిధి దీపక్‌కుమార్‌దే తెలిపారు. పలు విషాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

యునిసెఫ్ ఉద్దేశమేమిటి ?

చిన్నపిల్లలు, గర్భిణుల సమస్యలపై యూనిసెఫ్ పనిచేస్తుంది. వీరు ఆరోగ్యంగా ఉంటే వచ్చే జనరేషన్ పూర్తి ఆరోగ్యవంతంగా ఉంటుంది.

యునిసెఫ్ ద్వారా ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

యునిసెఫ్ 5అంశాలపై పని చేస్తుంది. ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం, నీరు-పారిశుధ్యం, పిల్లల పరిరక్షణ.

పిల్లలు, గర్భిణుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

యునిసెఫ్ ఐదు సౌకర్యాలు ఎలా అందుతున్నాయనే దానిపై అధ్యయనం చేసి వాటిని మరింత మెరుగ్గా వారికి అందించడానికి కృషి చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారు ఆసుపత్రుల్లోనే ప్రసవయ్యేలా అవగాహన కల్పిస్తున్నాం.

జిల్లాలో ఎక్కడెక్కడా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు?

జిల్లాలోని సిద్దిపేట మండలం లింగారెడ్డిపల్లి, మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామాల్లో యునిసెఫ్ బృందం పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తుంది. ఇక్కడి నివేదిక ఆధారంగా జిల్లా వ్యాప్తంగా తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం.






అప్పటి పందిరే అదరహో!

కాలం మారింది. టెక్నాలజీ పుంతలు తొక్కుతోంది. పచ్చని పెళ్లి పందిర్లను కూడా ఇది మారుస్తోంది. అన్ని చోట్ల ఆధునిక హంగులే కనపడుతున్నాయి. కానీ ఎన్ని నూతన పోకడలతో పెళ్లి పందిర్లను ముస్తాబు చేసినా ముత్యాల పందిర్ల కింద అవన్నీ బలాదూరే. పెళ్లిళ్లలో ముత్యాల పందిర్లు క్రమంగా మాయమవుతున్నాయి. ఎల్‌ఈడీ లైట్ల కింద, డిస్కో దీపాల కింద భారీ సెట్టింగ్‌లతో ఇప్పుడు పెళ్లి పందిర్లు వెలిగిపోతున్నాయి. మన పూర్వీకుల ఏర్పరచిన సంప్రదాయాన్ని ఇవి మైమరిపిస్తున్నా వాటి విలువ వాటిదే.

దుబ్బాక: వివాహ సమయంలో పెళ్లిపందిరికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రకృతితో మానవజీవితంతో ముడిపడి ఉందని, ప్రకృతిలోనే సకలదేవతలు కొలువుంటారనేది మన పూర్వీకుల నమ్మకం. మనిషి జీవితంలో ప్రధానమైన ఘటమైన పెళ్లి కార్యక్రమానికి దేవతలందరి ఆశీర్వాదాలుండాలనే భావనతో ప్రకృతితో కూడిన మండపాలను నిర్మించడం ఆచారంగా మార్చారు పెద్దలు. సరిసంఖ్యతో పెళ్లిపందిర్లను నిర్మించి, కొబ్బరి ఆకులతో పచ్చని పందిర్లు నిర్మించేవారు. వీటిని చతురస్రాకారం, అష్టభుజి ఆకారంలో వేయడం పరిపాటి. పందిరి కింద ముత్యాల పందిరిని కొబ్బరి ఆకులతో అందంగా తీర్చుతారు. హిందూ సంప్రదాయం ప్రకారం చాలామంది ఇంటిముందు 16 గుంజలతో పందిరి వేస్తారు. దీనికి తల్లి గుంజలు, పిల్లగుంజలు వేస్తారు. ఈ గుంజలను జాజు, సున్నతో అలకంరిస్తారు. ఈ గుంజలపై గురిగి (చిన్నమట్టికుండ)ని రవికగుడ్డ (జాకేటు వస్త్రం)తో కట్టి, దానిపై కంచుడు (మట్టిప్రమిద)ను పెట్టి పెళ్లికి ముందు రోజు, పెళ్లి రోజు, తర్వాత రోజు ఇలా మూడు రోజులు దీపారాధన చేస్తారు. పచ్చని పందిరిని అల్లనేరెడు, మామిడి, కానుగ, ఆకులతో నింపుతారు. పిల్ల గుంజకు ఒక వస్త్రంలో నవధాన్యాలు, నాణేంను కట్టి వాటిని పెళ్లి కూతురితో కట్టిస్తారు. దానికిందా ముత్యాల పందిరి వేస్తారు. ముత్యాల పందిరి వధూవరులకు రక్షణ వలయంగా భావిస్తారు. పెళ్లి పందిరి వరకు నడిచిన జంట అక్కడికి చేరిన తర్వాత అవాంతరాలు రావొద్దనేది దీని పరమార్థం.

ముత్యాల పందిరి విశిష్టత

రామాయణ కాలంలో రాముడు సచ్ఛమైన ముత్యాలతో పందిరి వేయించుకుని, సీతాదేవిని తన అర్ధాంగిగా స్వీకరించారంట. ముత్యాల పందిరి వేయడానికి ప్రధానంగా మనస్సు ప్రశాంతంగా ఉండాలని, ప్రశాంతంగా ఉంటేనే ఏపనైనా స్థితప్రజ్ఞతతో చేస్తారని చెబుతారు. చంద్రుడు తెలుపు, అతడు ధరించే ఆభరణము ముత్యం కావడంతో ముత్యాల పందిరి అనే మాట వాడుకలోకి వచ్చింది. ఇక పూర్వం అరణ్యాలలో వివాహాలు చేసుకునేవారంట. ఎక్కడ దట్టమైన చెట్లు ఉంటాయో దాన్ని పందిరిగా భావించి పెళ్లిళ్లు చేసుకునేవారంట. ఇదే అనవాయితీగా తర్వాత కాలంలో ఇంటిముంగటే ముత్యాల పందిరి, పెళ్లి పందిరి వేయడం పరిపాటిగా మారింది. ఈ ముత్యాల పందిరిని మేదరి కులస్థులు అలకరించేవారు. వీరు పెళ్లికి ముందు రోజు పందిరి గుంజలు, కొబ్బరి మట్టలు తెచ్చి అందంగా అల్లేవారు. వాటితో పందరిని అందంగా తీర్చిదిద్దేవారు.



ఇప్పుడన్నీ సెట్టింగ్‌లే

ప్రస్తుతం వివాహాలు కల్యాణమండపంలో ఎక్కువగా నిర్వహిస్తుండడంతో ముత్యాల పందిర్ల జాడలేకుండా పోయింది. 16 గుంజల పందిరి పోయి టెంట్ కింద చిన్న పందిరిలో పెళ్లిల్లు సాగుతున్నాయి. రంగురంగుల కాంతులను వెదజల్లే దీపాలంకరణలో వివాహాలు నిర్వహించుకుంటున్నారు. వీటికి ఆర్థిక భారం కూడా ఎక్కువే. ప్రస్తుతం కనీసం పచ్చని ఆకును కూడా తోరణంగా కట్టే పరిస్థితి లేదు. కానీ ఎన్ని నూతనవిధానాలొచ్చినా అనేక విలువలు కలిగిన పాతకాలం నాటి పెళ్లి పందిర్ల కింద ఇవన్నీ తక్కువే.



ఆధునిక కల్యాణ వేదిక సెట్టింగ్

గ్రామ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలి

● తిరుపతి, గ్రామ కార్యదర్శుల సంఘం డివిజన్ కార్యదర్శి

ఉద్యోగపర్వం



అర్హులైన గ్రామ కార్యదర్శులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి. గ్రూప్-4 ఉద్యోగులుగా ఉన్న కార్యదర్శులను అర్హులైన వారికి గ్రూప్-3 ప్రమోషన్ కల్పించాలి. చాలా సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీర్ఘకాలికంగా ఒకే గ్రామంలో ఉండడం వల్ల కూడా కొన్ని సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే బదిలీలు చేపట్టాలి. ఒక్క గ్రామ కార్యదర్శికి ఒకే గ్రామాన్ని ఇవ్వాలి. నాలుగైదు గ్రామాలను కేటాయించడం ద్వారా అన్ని గ్రామాలకు న్యాయం చేయలేకపోతున్నాం. క్లస్టర్ వారీగా గ్రామ కార్యదర్శులను నియమించాలి. ఇతర గ్రామపంచాయతీలకు వెళ్లినప్పుడు టీఏ, డీఏ అలవెన్స్‌లు ఇవ్వాలి.

- జగదేవ్‌పూర్

మహిమ కలిగిన మధన దుర్గమ్మ

● హన్మంత్‌రెడ్డి, జగదేవ్‌పూర్‌లోని మధన దుర్గమ్మ దేవాలయం పూజారి

భక్తి





జగదేవ్‌పూర్: మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని మధన దుర్గమ్మ దేవాలయం ఎంతో మహిమ కలిగినదిగా భక్తులు భావిస్తుంటారు. జగదేవ్‌పూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం గంధమల్లకు వెళ్లే దారిలోని మధనమ్మ వ్యవసాయ బావి వద్ద ఉన్న ఈ దేవాలయానికి మధన దుర్గమ్మగా పేరు వచ్చింది. మూడు దశాబ్దాల క్రితం మదనమ్మ కుటుంబంలోని కొందరికి అంతుచిక్కని ఆరోగ్య పరమైన సమస్య రావడంతో దుర్గమ్మ దేవాలయం నిర్మిస్తామని మొక్కడంతో వారికి ఆరోగ్య సమస్యలు నయమవ్వడంతో ఇక్కడ దుర్గమ్మ దేవాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఈ ప్రాంత వాసులు మహిమ గల్ల దుర్గమ్మగా కొలుస్తారు. ప్రతి రోజు భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం భారీగా భక్తులు వస్తుంటారు. కోరికలు కోరుకొని ముడుపులు కట్టిన భక్తులు వారి కోరక తీరగానే ముడుపు చెల్లించుకుంటారు.



డివైడర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

పుట్‌పాత్‌ల నిర్మాణ పనుల్లో

జాప్యంపై మంత్రి సీరియస్

• దసరా నాటికి పూర్తి చేయాలని ఆదేశం

సిద్ది పేట కల్చరల్: పట్టణంలోని మెదక్ రోడ్డులోని ప్రశాంత్‌నగర్ పుట్‌పాత్ నిర్మాణ పనుల్లో జాప్యంపై మంత్రి హరీశ్‌రావు ఆర్‌అండ్‌బీ అధికారులపై, సదరు కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. శనివారం సిద్దిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న హరీశ్‌రావు పుట్‌పాత్‌లను పరిశీలించారు. దసరా నాటికి పుట్‌పాత్, డివైడర్లపై రాతి కట్టడం, విద్యుత్ స్తంభాల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా డివైడర్లను నిర్మించొద్దని హరీశ్‌రావు సూచించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమలో ఆర్‌అండ్‌బీ అధికారి బాల్‌నర్సయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి కౌన్సిలర్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ముస్లింలకు హజ్‌యాత్ర ప్రత్యేకం

• రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సారెడ్డి



యాత్రకు వెళ్తున్న ముస్లింలను సన్మానిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్‌అర్బన్: ముస్లింల జీవితంలో హజ్‌యాత్రకు ప్రత్యేక స్థానం ఉంటుందని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మదీనా మజీద్‌లో హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులను శనివారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రతి ముస్లిం తమ జీవితంలో ఒక్కసారైనా హజ్‌యాత్రకు వెళ్లాలని కోరుకుంటారన్నారు. యాత్రకు వెళ్తున్న ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట నాయకులు యాదగిరి, సాజిద్‌బేగ్, వాహెద్, మథీన్ తదితరులున్నారు.

నిప్పంటించుకుని మహిళ మృతి

మర్కుక్: ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని మహిళ మృతిచెందిన ఘటన గంగాపూర్‌లో శనివారం జరిగింది. రాజమైన కల్పన(30) 10వ తేదీన కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఆమె రాత్రి 10గంటలకు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కల్పన భర్త బాల్‌రాజే కిరోసిన్ పోసి హత్య చేసి ఉంటాడని కల్పన తల్లిదండ్రులు ఆరోపిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఏఎస్‌ఐ యూసుఫ్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

కుక్కల దాడిలో 14గొర్రెల మృతి

గజ్వేల్‌అర్బన్/రాయపోల్: కుక్కల దాడిలో 14గొర్రెలు మృతిచెందిన ఘటన రాయపోల్ మండలం అనాజీపూర్‌లో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే మన్నె యాదయ్య రోజూ మాదిరిగానే శుక్రవారం రాత్రి తన గొర్రెలను గ్రామ సమీపాన ఉన్న తన కొట్టంలో కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. శనివారం ఉదయం వెళ్లి చూసే సరికి తనకున్న 50గొర్రెల్లో 14గొర్రెలు మృతిచెందగా మరో 9గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. దాదాపు రూ. లక్ష నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తరపున యాదయ్యను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



విలపిస్తున్న యాదయ్య

స్వచ్ఛ దుబ్బాకకు తొలిమెట్టు

• బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరపంచాయతీగా దుబ్బాక

• వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి

• చైతన్యం కల్పించడంలో కమిషనర్ చొరవ

దుబ్బాక: మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరపంచాయతీగా దుబ్బాక రూపుదిద్దుకుంది. రెండేళ్ల నుంచి మరుగుదొడ్ల నిర్మాణపనులను కొనసాగుతున్నాయి. పట్టణంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణమే లక్ష్యంగా నగర కమిషనర్ ఇంటింటా తిరిగి స్వచ్ఛతపై అవగాహన కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. దీంతో నగరంలో 2వేల రెండువందల 83 వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించారు. 27వేల మంది జనాభ ఉన్న నగరపంచాయతీలో 2015లో



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న బోగేశ్వర్లు



అవగాహన ర్యాలీ(ఫైల్)

స్వచ్ఛభారత్-స్వచ్ఛతెలంగాణ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మొదట మహిళా సంఘాల ప్రతినిధులు ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించారు. మొత్తం 7వేల 125 నివాస గృహాలుండగా, అందులో 4వేల 8వందల 42 ఇళ్లకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి.

ప్రత్యేక ప్రణాళికతో

నగర పంచాయతీలో 2283 మరుగుదొడ్లను నిర్మించడానికి అధికారులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. పట్టణంలోని 20 వార్డుల్లో మరుగుదొడ్లను నిర్మించడానికి ఒక్కో వార్డుకు ఒక్కో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో కమిషనర్, వార్డు స్పెషల్ అధికారి, ఏఈ, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళాసంఘాల ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులను కమిటీలో నియమించారు. ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఇచ్చే రూ. 12వేల గురించి కమిటీ సభ్యులు వార్డుల్లో అవగాహన కల్పించారు. ప్రజల్లో చైతన్యం తెచ్చి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. నిర్మించుకున్న వారికి బిల్లులు అందేలా ముందుండి చొరవ చూపారు. 83 మరుగుదొడ్లను నిర్మించుకున్న వారికి రూ. 2కోట్ల 73లక్షలు చెల్లించాల్సి ఉండగా, రూ. 2కోట్ల 58 లక్షలు చెల్లించారు.

9న ప్రాథమిక నోఫికేషన్ జారీ

శతశాతం మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యం నెరవేరడంతో 9న బహిరంగ మలమూత్రవిసర్జ రహిత నగరపంచాయతీగా దుబ్బాకను ప్రకటిస్తూ, ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉంది.

అవగాహన కార్యక్రమాలతో చైతన్యం

నగరపంచాయతీ కమిషనర్ స్వచ్ఛతపైన అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి వార్డులో మహిళలు, యువకులు, విద్యార్థులతో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించారు. కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.

ప్రజల సహకారంతోనే సాధ్యమయింది



వందశాతం మరుగుదొడ్ల లక్ష్యం నెరవేరడానికి ప్రజల సహకారం ఎంతో ఉంది. ప్రజలు తమ ఆర్థిక సమస్యలను పక్కన పెట్టి, ఇచ్చిన పిలుపును స్వీకరించారు. రాష్ట్రంలో కూడా ముందుండేలా మరింత కృషి చేస్తాం.

-బోగేశ్వర్లు, నగరపంచాయతీ కమిషనర్

రైతు బజార్ నిర్మాణం హుస్నాబాద్ ప్రజల కల

• రూ.80లక్షలతో నిర్మాణం

• మటన్,ఫిష్ మార్కెట్లు కూడా ఏర్పాటు

• రేపు శంకుస్థాపన చేయనున్న మంత్రి హరీశ్

హుస్నాబాద్: ఎన్నో రోజులుగా హుస్నాబాద్ ప్రజలు ఎదురుచూస్తున్న రైతు బజార్ కల త్వరలో నేరవేరనుంది. పట్టణంలో రైతుబజార్ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు కృషితో ప్రభుత్వం రూ. 80లక్షలు మంజూరు చేసింది. దీనికి సోమవారం మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రైతుబజార్‌ను పట్టణంలోని రామవరం రోడ్డులోని 266/1 సర్వేనెంబర్‌లోని 20 గుంటల స్థలంలో నిర్మించనున్నారు. ఈ రైతుబజార్‌లో కూరగాయల మార్కెట్‌తో పాటు మటన్, ఫిష్ మార్కెట్లు కూడా నిర్మించనున్నారు. ఇంతకాలంగా రైతుబజార్ లేకపోవడంతో ప్రధాన రోడ్లపైనే క్రయ విక్రయాలు జరిగేవి. మటన్, ఫిష్ మార్కెట్లు కూడా రోడ్లపైనే నిర్వహించేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్ళారు. కాగా ఆయన రైతుబజార్‌కు స్థలం కేటాయించిన వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన కొద్ది రోజుల్లోనే రూ.80లక్షలు మంజూరు చేశారు. రైతుబజార్ త్వరగా నిర్మించి అందుబాటులోకి వస్తే రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది.



హుస్నాబాద్‌లో రైతుబజార్ నిర్మించనున్న స్థలం

యూరియా కలిపిన నీళ్లు తాగి పశువులు మృతి

జగదేవ్‌పూర్: యూరియా కలిపిన నీళ్లు తాగి పశువులు మృతిచెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. బాల్‌నర్సయ్యకు చెందిన కాడెడ్లు, పాడిగేదె యూరియా కలిపిన నీళ్లను తాగడంతో పాడిగేదె, ఒక ఎద్దు మృతిచెందాయి. డ్రిప్ కోసం యూరియా కలిపిన నీళ్లను పైప్‌లైన్ల ద్వారా వదులుతుండగా పశువులు నీళ్లు తాగే హౌస్ వద్ద పైప్‌కు మూత బిగించకపోవడంతో యూరియా నీళ్లు హౌస్‌లో చేరాయి. సాయంత్రం పశువులు హౌస్‌లో నీళ్లు తాగి మృతిచెందాయి. సుమారు రూ. లక్షా యాభైవేల నష్టం వాటిల్లినట్లు బాల్‌నర్సయ్య తెలిపారు.



కాడెడ్దు, గేదె కళేబరాలు



ఆవు కళేబరం

మర్కుక్‌లో

మర్కుక్: మర్కుక్‌లో రాఘవరెడ్డికి చెందిన ఆవు అకస్మాత్తుగా మృతిచెందింది. మూడు నెలల క్రితం రాఘవరెడ్డి 5 జెర్సీ ఆవులను కొనుగోలు చేయగా గతంలోనే మూడు ఆవులు మృతిచెందాయి. దీంతో రూ. 3లక్షల నష్టం వాటిల్లిందని తమను ప్రభుత్వమే ఆదుకోవాలని, లేని పక్షంలో తమకు చావేదిక్కని రాఘవరెడ్డి విలపించాడు.

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

బెజ్జంకి: బెజ్జంకిలో కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. కొరెపు చంద్రం(23) 6 నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడున్నాడు. ఇంటి వెనుక ఉన్న మేకల షెడ్డులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్ అనే వ్యక్తి గమనించి కుటుంబసభ్యులకు తెలిపాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు.

సంగారెడ్డిలో మెడికల్ కళాశాల కోసం 17నుంచి ఆమరణ నిరాహార దీక్ష

● మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీ నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేపడతానని స్థానిక మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సంగారెడ్డిలో మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామన్నారు. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మంత్రి హరీశ్‌రావు పక్షపాత ధోరణితో సంగారెడ్డిలో ఏర్పాటు కావాల్సిన మెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేటలో ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. సంగారెడ్డిలో ప్రతిపాదించిన మెడికల్ కళాశాలను సిద్దిపేటలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మూడు నెలల క్రితం ఆందోళనలు చేపట్టామని, అయినా ఎలాంటి ప్రస్తావనగానీ, ప్రకటన గానీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేయకపోయారన్నారు. సంగారెడ్డిలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి, శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించే వరకు పోరాటం చేస్తామని జగ్గారెడ్డి హెచ్చరించారు. ఈ నెల 17న సంగారెడ్డిలోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

కోదండరాం అరెస్టు దుర్మార్గపు చర్య

తెలంగాణ సాధన కోసం సకల జనులను సమీకరించి ఎన్నో ఉద్యమాలను నిర్వహించిన జేఏసీ చైర్మన్ కోదండరాంను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు ఎంతో అండగా నిలిచిన కోదండరామ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు యాత్రలు చేస్తుంటే జీర్ణించుకోలేని సీఎం కేసీఆర్ అణగదొక్కుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం కోదండరామ్‌తోపాటు జేఏసీ శ్రేణులను అరెస్ట్ చేయడం దురదృష్టకరమన్నారు. నియంతృత్వపాలన కొనసాగిస్తున్న సీఎం కేసీఆర్ గద్దెను కూల్చే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయన్నారు.

'ఆశాజ్యోతి'కి అండగా ఉంటా

● రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి

గజ్వేల్‌అర్బన్: 'ఆశాజ్యోతి'కి అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ పరిధిలోని ఆశాజ్యోతి కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల పరిధితో పాటు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఆశాజ్యోతి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తాను వ్యక్తిగతంగా స్నేహితులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు కృషిచేస్తానని భూంరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీఎస్పీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జగదేవ్‌పూర్ జడ్పీటీసీ రామచంద్రం, డాక్టర్ మల్లయ్య, నాయకులు నారాయణరెడ్డి, ఆకుల దేవేందర్, భూపాల్‌రెడ్డి, నర్సింగరావు, ఆశాజ్యోతి ఫాదర్ ఆల్విన్, సుపీరియర్ ఫాదర్ ఫెలిక్స్, ఫాదర్ మైకేల్, ఆనంద్, కోఆర్డినేటర్ వీరబాబు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మడుపు భూంరెడ్డి

'అమరుల స్ఫూర్తియాత్ర'లో ఉద్రిక్తత

● జేఏసీ చైర్మన్ కోదండరాం, నేతల అరెస్టు ● తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద తీవ్ర ఉద్రిక్తత ● ముందస్తుగా తూప్రాన్‌లో 144 సెక్షన్ అమలు
● మెదక్, నిజామాబాద్, కామారెడ్డి పోలీసుల మోహరింపు ● మెదక్ డీఎస్పీకి గాయాలు ● అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలింపు
● కోదండరాం పర్యటనపై తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద కోదండరాం వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు, ఆరెస్టయిన టీజేఏసీ నాయకులు, టోల్‌ప్లాజా వద్ద మోహరించిన పోలీసులు

తూప్రాన్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి ఆశయాల సాధనకు నిజామాబాద్‌లో టీజేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాం చేపట్టిన 'అమరవీరుల స్ఫూర్తియాత్ర'ను మెదక్ జిల్లా తూప్రాన్‌లో శనివారం పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తెల్లవారుజాము నుంచే నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల పోలీసులను భారీగా తూప్రాన్‌కు తరలించారు. అర్ధరాత్రి నుంచే తూప్రాన్‌లో 144 సెక్షన్ అమలు చేశారు. టోల్‌ప్లాజా వద్ద భారీగా పోలీసులను మోహరించి కోదండరాంను, జేఏసీ నేతలను అరెస్టు చేశారు. దీంతో టోల్‌ప్లాజా వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కోదండరాంను కౌడిపల్లి పోలీసుస్టేషన్‌కు, టీజేఏసీ నేతలను పలు పోలీసుస్టేషన్లకు తరలించారు. అరెస్టు సమయంలో కోదండరాం వాహనం ఢీకొని మెదక్ డీఎస్పీ గాయపడ్డారు. ఈ ప్రమాదంపై, 144 సెక్షన్ ఉల్లంఘనపై తూప్రాన్ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. కాగా.. యాత్ర కోసం టీజేఏసీ నేతలు పెట్టుకున్న అనుమతులను పోలీసులు తిరస్కరించారు. బహిరంగసభ కాకుండా హౌస్ మీటింగ్ నిర్వహిస్తామని కోదండరాం, జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ మార్గంలోని మెదక్ జిల్లా తూప్రాన్‌లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి 144 సెక్షన్‌ను మూడు రోజుల పాటు అమలు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. మెదక్ ఏఎస్పీ రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీగా పోలీసులను మోహరించారు. తూప్రాన్ ఇన్‌చార్జి, మెదక్ డీఎస్పీ నాగరాజు, సంగారెడ్డి డీఎస్పీ తిరుపతన్న, తూప్రాన్, రామాయంపేట సీఐలు లింగేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డిలతోపాటు, జిల్లాలోని పలువురు ఎస్ఐలు తూప్రాన్‌లో మోహరించారు. మేడ్చల్‌కు కోదండరాం వచ్చినట్లు సమాచారం రావడంతో అరెస్టులకు సిద్ధమయ్యారు. కోదండరాం ప్రయాణిస్తున్న వాహనం నంబరు తెలియకపోవడంతో దాని కోసం వెతకసాగారు. కాళ్లకల్‌లోకి వచ్చినట్లు సమాచారం అందడంతో టోల్‌ప్లాజా వద్దకు రాగానే పోలీసులు ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు. దీంతో ఆయన వెంటే ఇతర వాహనాల్లో వస్తున్న టీజేఏసీ నాయకులు ఆందోళన చేశారు. వాహనం నుంచి దిగాలని కోదండరాంను కోరినా ఆయన ఒప్పుకోలేదు. చివరకు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, సంగారెడ్డి డీఎస్పీ తిరుపతన్న కోదండరామ్ వాహనంలోకి ఎక్కారు. కోదండరాంను నిజామాబాద్ తరలిస్తున్నట్లు ప్రకటించిన పోలీసులు, దారి మళ్లించి శివ్వంపేట, నర్సాపూర్ మీదుగా కౌడిపల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. వెంటొచ్చిన టీజేఏసీ నాయకులను ముందుగా తూప్రాన్ పోలీసుస్టేషన్‌కు అక్కడ నుంచి మెదక్ మీదుగా పాపన్నపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద టీజేఏసీ జిల్లా కన్వీనర్లు సడిమెల యాదగిరి (మెదక్), తుల్జారెడ్డి(సంగారెడ్డి)లను అరెస్టు చేశారు.

తూప్రాన్‌లో రెండు కేసులు

కోదండరాం పర్యటనలో తూప్రాన్ పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. వాహనాన్ని పక్కకు తప్పించేందుకు ముందు నిలబడిన మెదక్ డీఎస్పీ నాగరాజుకు కోదండరాం ప్రయాణిస్తున్న వాహనం ముందు బంపర్ ఢీకొన్నది. దీంతో నాగరాజుకు బలమైన గాయమై, కిందపడిపోయారు. ఆయనను అంబులెన్స్‌లో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. దీంతో కోదండరాం వాహనం, డ్రైవర్ రతన్‌రావులపై సెక్షన్ 337 కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, తూప్రాన్‌లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కల్గించారని కోదండరాం, మరో 29 మందిపై 151 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

అధికార దుర్వినియోగం చేస్తున్నారు

- జేఏసీ చైర్మన్ కోదండరాం

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం చేస్తున్నారని కోదండరాం టీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక మాఫియా వాళ్లదే.. భూముల దందా వాళ్లదే.. కాంట్రాక్టులు వాళ్లవే... అంటూ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఈ అధికార దుర్వినియోగాన్ని, విచ్చలవిడితనాన్ని మేము వ్యతిరేకిస్తున్నందున వాళ్లకు ఎక్కువ కోపం వస్తోందన్నారు. మమ్మల్ని నాలుగు పోలీసు వాహనాలు తరుముతూ వచ్చాయని ఆయన ఆరోపించారు.

రెండుగంటల పాటు పోలీసుల అదుపులో

కౌడిపల్లి: నాటకీయ పరిణామాల మధ్య ప్రొఫెసర్ కోదండరాంను మధ్యాహ్నం 2:15 నుంచి సాయంత్రం 4:15గంటల వరకు కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. కోదండరాంను కలువడానికి వచ్చిన టీజేఏసీ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీల నాయకులతోపాటు కోదండరాంకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన మల్కాజిగిరి జేఏసీ కన్వీనర్ సుకన్య, మెదక్ డీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్‌ను పోలీసులు అడ్డుకుని వారిని వేరే ప్రాంతాలకు తరలించారు.

కాంగ్రెస్‌లో ముందస్తు కసరత్తు

● మెదక్ లోక్‌సభ అభ్యర్థిగా పరిశీలనలో పద్మినీ దామోదర్
● పటాన్‌చెరు అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎంపీ విజయశాంతి
● అసెంబ్లీకి అందరూ పాతకాపులే
● సిద్దిపేట అసెంబ్లీకి కొత్త అభ్యర్థి కోసం అన్వేషణ
● గజ్వేల్‌లో బలమైన అభ్యర్థిని నిలిపే యోచన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్‌లో అప్పుడే ఎన్నికల కసరత్తు మొదలైంది. షెడ్యూలు ప్రకారం 2019లో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ ఆర్నెల్లు ముందుగా రావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతున్నది. ఈసారి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులకు దీటైన అభ్యర్థులను నిలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. మెదక్ పార్లమెంట్ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ ఉపముఖ్యమంత్రి రాజనర్సింహ సతీమణి పద్మిని పేరును పార్టీ ఉమ్మడి జిల్లా నాయకత్వం పరిశీలిస్తున్నది. పద్మిని కూడా రాజకీయాల పట్ల ఆసక్తిగానే ఉన్నారు. ఈమెను పోటీకి దించేందుకు రాజనర్సింహ సుముఖంగానే ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

అసెంబ్లీకి చాలా వరకు పాతకాపులే

అసెంబ్లీ నియోజకవర్గాలకు చాలా వరకు పాతకాపులే అభ్యర్థులుగా ఉండనున్నారు. అందోలు నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గీతారెడ్డి, నర్సాపూర్‌కు మాజీ మంత్రి వి.సునీతారెడ్డి, సంగారెడ్డికి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి అభ్యర్థులుగా ఖరారు కానున్నారు. దుబ్బాక నుంచి మాజీ మంత్రి ముత్యంరెడ్డిని పోటీకి దింపాలని జిల్లా నాయకత్వం నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. అయితే ఈ నియోజకవర్గ టికెట్‌ను ముత్యంరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి నర్సాగౌడ్, సోమేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రావు ఆశిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక ఖేడ్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎంపీపీ అధ్యక్షుడు, డాక్టర్ పి.సంజీవరెడ్డిలను సమన్వయపర్చి ఒకరిని ఖేడ్ అసెంబ్లీకి, ఇంకొకరిని జహీరాబాద్ పార్లమెంట్‌కు పోటీ చేయించాలని జిల్లా నాయకత్వం భావిస్తున్నది. మెదక్ అసెంబ్లీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, సుప్రభాతరావు ఆశిస్తున్నారని, తిరుపతిరెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నందున ఆయన అభ్యర్థిత్వం పరిశీలనకు వస్తుందో లేదో తెలియదని పార్టీ వర్గాలు తెలిపాయి.

పటాన్‌చెరుకు విజయశాంతి?

పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సినీనటి, మాజీ ఎంపీ విజయశాంతిని పోటీ చేయించాలని జిల్లా నాయకత్వం ఆలోచిస్తున్నది. గత సార్వత్రిక ఎన్నికల్లో మెదక్ అసెంబ్లీ నుంచి పోటీ చేసి, ఓడినప్పటి నుంచి ఆమె క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే పటాన్‌చెరు అర్బన్ నియోజకవర్గం కావడంతో విజయశాంతిని పోటీకి దింపితే బావుంటుందని కొందరు జిల్లా నాయకులు పార్టీకి ప్రతిపాదించినట్టు తెలిసింది. కాగా ఈ టిక్కెట్‌ను కార్పొరేటర్ శంకర్‌యాదవ్, జడ్పీలో కాంగ్రెస్ నేత కె.ప్రభాకర్, అమీన్‌పూర్ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ కూడా ఆశిస్తున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి.

గజ్వేల్‌కు బలమైన అభ్యర్థి

సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి బలమైన అభ్యర్థిని పోటీకి దింపాలని కాంగ్రెస్ యోచిస్తున్నది. స్థానికంగా పలుకుబడి ఉన్న ముఖ్య నాయకుడిని కాంగ్రెస్‌లో చేర్చుకుని, పోటీ చేయించాలని జిల్లా నాయకత్వం భావిస్తున్నది. ఇక మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో కాంగ్రెస్ నుంచి ఎవరు పోటీ చేసినా కష్టమే. కనీసం గట్టిపోటీ ఇవ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్రస్థాయి నాయకుడిని పోటీలో నిలపాలని నాయకత్వం ఆలోచిస్తున్నది.

రాత్రింబవళ్లు పని చేసి

రంగనాయకసాగర్ పూర్తిచేస్తాం

- అవసరానికి మించి భూసేకరణ చేయొద్దు
- నష్టాన్ని ఇంజనీర్ల నుంచి రికవరి చేస్తా
- నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్ది పేట కల్చరల్: తొమ్మిది నెలల్లో రంగనాయక సాగర్ పూర్తి చేయాలన్న లక్ష్యంతో రేయింబవళ్లు పనులు జరుగుతున్నాయని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం కాళేశ్వరం ప్రాజెక్ట్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ భూసేకరణపై సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రిజర్వాయర్ భూసేకరణకు సంబందించి హుస్నాబాద్, సిద్దిపేట రెవెన్యూ డివిజన్లలో ఆయా మండలాల్లోని గ్రామాలవారిగా భూసేకరణ పై ఆయన సమీక్షించారు. సాధారణంగా ప్రాజెక్టు నిర్మాణానికి మూడున్నర సంవత్సరాలు సమయం పడుతుందని, ప్రభుత్వం 9 నెలల్లో పూర్తి చేయాలన్న సంకల్పం, లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. కోటి క్యూబిక్ మీటర్ల మట్టి సనులు చేయాల్సి ఉందని, ప్రతి రోజు చేసిన మట్టి పనులపై ఇంజనీర్లు వాట్సప్ ద్వారా తనకు రిపోర్టు అందించాలని ఆయన సూచించారు. జిల్లాలో అతి ప్రాముఖ్యమైనది రంగనాయక సాగర్ రిజర్వాయర్ అని ఆయన తెలిపారు. నీళ్లు ఇవ్వాలంటే రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలని, దీనికి సంబంధించిన భూసేకరణ వేగవంతంగా చేయాలని అధికారులకు సూచించారు. దీనికోసం రైతులతో మాట్లాడి వారి ఆమోదంతో నోటిఫికేషన్, చెల్లింపులు పూర్తి చేసేందుకు అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. డిస్ట్రిబ్యూటరి కాల్వలకు సంబందించిన భూసేకరణ త్వరగా పూర్తిచేయాలన్నారు. దీనికి సంబందించి మట్టి పనుల క్వాలిటీ కంట్రోల్ విభాగం నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. అవసరానికి మించి భూసేకరణ చేయరాదని, అటువంటిది తన దృష్టికి వస్తే భూసేకరణ ఖర్చును ఆయా ఇంజనీర్ల జీతాల నుండి రికవరీ చేస్తానని ఆయన హెచ్చరించారు. ఆగస్టు 30లోగా పట్టా అసైన్ ల్యాండ్ భూసూకరణ పక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ సీఈ హరిరాం, ఇంజనీర్లు, ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, ఏంపీపీలు, జడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని అద్భుతంగా నిర్మించండి

- పీఏసీఎస్ భవన శంకుస్థాపనలో మంత్రి హరీశ్‌రావు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్ది పేట కల్చరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవానాన్ని అద్భుతంగా నిర్మించాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులకు సూచించారు. శనివారం సిద్దిపేటలోని దూది మల్లారెడ్డి పంక్షన్‌హాల్ వద్ద రూ. 51 లక్షలతో నిర్మించ తలపెట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనం కోసం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్ ప్రవీణ్, గుడాల శ్రీకాంత్, బర్ల మల్లికార్జున్, రాజనరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ఇర్కోడు విజయం

- రాష్ట్రంలోనే తొలి సామూహిక గొర్రెల షెడ్ ప్రారంభం
- పేదల ఆరోగ్యంపై సర్కారు ప్రత్యేక దృష్టి
- సిద్దిపేటలోనే అమెరికా తరహా వైద్యం అందించాలనే లక్ష్యం మాది
- భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్ది పేట రూరల్ : ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని సిద్దిపేట మండలం ఇర్కోడ్ గ్రామ ప్రజలు నిరుపించారని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట మండలం ఇర్కోడు గ్రామంలో పర్యటించిన మంత్రి డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి, రజక, ముదిరాజ్, రెడ్డి సంఘాల భవనాలకు, కోపరేటివ్ సోసైటీ ఆధ్వర్యంలో సాముహిక దుకాణ సముదాయ భవన నిర్మానాలకు శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ఐకేపీ గోదాం, సాముహిక గొర్రెల షెడ్, ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూంలు, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని బాలికల హస్టల్ విద్యార్థినులకు సోలార్ హీటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ప్రతి పనిలో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే అది పదికాలల పాటు సురక్షితంగా ఉంటుందని చెప్పారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో



బ్యాటరీ ఆటోను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్

మోడల్ తరగతి గదులు, డిజిటల్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, డెస్కులు, మోడల్ టాయిలెట్లు, ఉచిత భోజనం, పుస్తకాల అందజేత వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఇంటి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని సూచించారు. ఎస్సీలకు పంక్షన్‌హాల్‌కు రూ.5లక్షలు, లైబ్రరీ నిర్మాణానికి రూ.8 లక్షలు మంజురు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని చిన్నగుండవెల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్, అంగన్‌వాడీ భవనం, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. గ్రామంలో ఫంక్షన్‌హాల్ నిర్మించేందుకు నిధులు మంజురు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ భవనం సొంత ఇంటికన్న అద్భుతంగా నిర్మించారని సర్పంచ్ భూమయ్యగారి కిషన్‌రెడ్డిని అభినందించారు.

వృద్ధులకు మొక్కల సంరక్షణ

పిల్లల భవిష్యత్ కోసం మొక్కలు పెంచాలని కోరారు. గ్రామంలోని వృద్ధులతో సంఘం ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి ఐదు మొక్కల బాధ్యత అప్పగిస్తే వారు నీళ్లు పోసి వాటిని సంరక్షిస్తారని సూచించారు. వర్షాలు కురవలన్నా, సంపూర్ణ ఆరోగ్యం పొందలన్న చెట్లు ఉండాల్సిందేనన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు వైద్యం

సిద్దిపేట నియెజకవర్గం ప్రజలకు అమెరిక తరహాలో వైద్యం అందించలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. సిద్దిపేటలో 100 పడకల ఆస్పత్రి 300 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశామని, సీఎం కేసీఆర్ కృషితో వచ్చే సంవత్సరం వరకు వైద్య కళాశాల అందుబాటులోకి వస్తుందన్నారు. కార్పొరేటుకు దీటుగా వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లొద్దని కోరారు. అనవసరపు ఆపరేషన్లు చేసి తల్లిబిడ్డ ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారని వివరించారు. ఆపరేషన్ కన్నా సుఖప్రసవాలనే ప్రోత్సహించాలని సూచించారు. మరో పది రోజుల్లో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. పేషెంట్ వెంట ఉండే అటెండర్‌కు నాణ్యమైన ఉచిత భోజనం అందిస్తున్నమన్నారు. ఇప్పటికే ఇక్కడ ఐసీయూ సెంటర్ అందుబాటులో ఉందన్నారు. గతంలో 'నేను పోను కోడుకో సర్కారు దవాఖానకు అని పాడారని ఇప్పుడు నేను పోను కోడుకో ప్రైవేటు దవాఖానకు' అనేలా మారిందని మంత్రి చెప్పడంతో సమావేశంలో చప్పట్ల మోత మోగింది.



గొర్రెల షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గొర్రెల షెడ్ నిర్మాణానికి రూ.53 వేలు

గ్రామంలోకి గొర్రెలు రావడం వల్ల పారిశుధ్యం లోపిస్తుందని గ్రహించిన సర్పంచ్ మారెడ్డి వినితారవీందర్‌రెడ్డి గ్రామ శివారులో సామూహిక గొర్రెల షెడ్ నిర్మించడం సంతోషకరమని మంత్రి అన్నారు. సామూహిక గొర్రెల షెడ్ నిర్మించడం రాష్ట్రంలోనే మొదటిదని కొనియాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్ నిర్మాణానికి రూ.53 వేలు ఇస్తుందని, అవి సరిపడకపోవడం వల్ల గ్రామపంచాయతీ, గొర్రె కాపారులు భాగస్వామ్యంతో గొర్రెలకు సరిపడే విధంగా నిర్మిచుకోవడం అభినందనీయమన్నారు. ఇర్కోడ్‌లో పురాతనమైన ఎస్సీ కమ్యూనిటీహాల్ కూల్చి అక్కడే పంక్షన్‌హాల్ నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు జమ చేయడం సంతోషకరమన్నారు. వాటికి తోడుగా మరో ఐదు లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ రిజినల్ కోఆర్డినేటర్‌బూర విజయ, సిద్దిపేట, నంగునూరు ఎంపీపీలు ఎర్ర యాదయ్య, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీహరిగౌడ్, సిద్దిపేట ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ వజ్రవ్వయాదగిరి, పీఏసీఎస్ చైర్మన్లు నల్ల నరేందర్ రెడ్డి, కిసర పాపయ్య, బాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భూమయ్యగారి కిషన్ రెడ్డి, ఇర్కోడ్ ఎంపీటీసీ చిట్యాల రమ సత్యానారాయణగౌడ్, నాయకులు బాలకిషన్‌రావు, బూర మల్లేశం, బీఆర్ గౌడ్, కనకరాజు, బాలకృష్ణరెడ్డి, పరమేశ్వర్ గౌడ్, అధికారులు డీపీవో సురేశ్‌బాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ కర్ణాకర్‌బాబు, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈఈ వేణుగోపాల్‌రావు, ఏఈ చారి, ఓఎస్‌డీ బాల్ రాజ్, ఎంపీడీవో సమ్మిరెడ్డి, తహసీల్దార్ పరమేశ్వర్, ఆర్ఐ లలిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దౌలాపూర్‌లో భూముల రీ సర్వే

- పైలట్ ప్రాజెక్ట్‌గా గ్రామం ఎంపిక
- సుదీర్ఘ భూ సమస్యలకు పరిష్కారం
- రైతుల కబ్జాకు చట్టబద్ధత
- కమతాల ఏకీకరణకు మార్గం సుగమం
- గ్రామానికి చేరుకున్న అధికారుల బృందం

జగదేవ్‌పూర్: భూముల రీ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకొని రీ సర్వే చేయనున్నారు. గ్రామంలోని రెవెన్యూ రికార్డుల ప్రకారం భూముల వివరాలు, భూమిపై కబ్జాలో ఉన్న వివరాలు పరిశీలించనున్నారు. రాష్ట్రంలోని భూములు సర్వే చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించగా పైలట్ ప్రాజెక్ట్‌గా రంగారెడ్డి జిల్లాలోని రెండు గ్రామాలతో పాటు సిద్దిపేట జిల్లాలోని దౌలాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. రాష్ట్ర సర్వే విభాగానికి చెందిన అధికారి అంబటి రాముతో పాటు అధికారుల బృందం శనివారం దౌలాపూర్ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని భూముల రికార్డుల వివరాలు పరిశీలించారు. గ్రామంలోని 2000ఎకరాలలో సర్వే చేయనున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న ప్రకారం భూ కబ్జాలో ఉన్న వారి వివరాలు సేకరించనున్నారు. భూమి విస్తీర్ణం, రికార్డులో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలిస్తారు. ఇందుకోసం అధికారుల బృందం నాలుగు రోజులు పాటు గ్రామంలోనే ఉండి సర్వే చేయనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే కొనసాగనున్నది. కాగా ఈ భూముల సర్వేతో



భూములను పరిశీలిస్తున్న అధికారుల బృందం

సుదీర్ఘ కాల సమస్యకు పరిష్కారం ఏర్పడనున్నది. కబ్జాలో ఉన్న రైతులకు చట్టబద్ద ఏర్పడే అవకాశముంది. కాగా సీఎం కేసీఆర్ చెప్పిన విధంగా భూ కమతాల ఏకీకరణకు మార్గం సుగమం కానున్నది.

రీ సర్వే విధానంపై సమీక్ష

భూ రీ సర్వే విధానంపై అధికారుల బృందం సమీక్ష నిర్వహించింది. శనివారం దౌలాపూర్ గ్రామంలో అధికారులు ఎలా సర్వే చేయాలనేదానిపై సమీక్ష నిర్వహించారు. సర్వే విభాగం అధికారి అంబటి రాము, సిద్దిపేట ఆర్డీవో ముత్యరెడ్డిలు సర్వే ఎలా చేయాలనేదానిపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ముత్యంరెడ్డి రీ సర్వేకు సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని పలువురి భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, వీఆర్వోలు తిరుపతి, హరీష్, కృష్ణ, జ్యోతి, ప్రవీణ్, ఆంజనేయులు, సర్వేయర్ తదితరులున్నారు.

గజ్వేల్ శివారులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

- 'ఆంధ్రజ్యోతి' డ్రగ్స్ కథనంతో అనుమానిత వ్యక్తుల సోదా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్‌అర్బన్: గజ్వేల్‌కూ డ్రగ్స్ అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనం పట్టణంలో చర్చనీయాంశమైంది. కొన్ని రోజులుగా రాష్ట్రాన్ని వణికిస్తున్న డ్రగ్స్ అంశం గజ్వేల్‌కు చేరుకోవడంతో గజ్వేల్‌లో ప్రజల మధ్య తీవ్ర చర్చ నడుస్తుంది. ఇదిలా ఉండగా గజ్వేల్ ఎక్సైజ్ సీఐ ప్రభావతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్ఐ ముబీన్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో పాండవుల చెరువు, రాజిరెడ్డిపల్లి రోడ్డు, శివారు ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు. అనుమానిత వ్యక్తులను సోదా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ముబీన్ మాట్లాడుతూ డ్రగ్స్ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దని, తల్లిదండ్రుల పిల్లలను రక్షించుకోవాలని సూచించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం


పాపతో టెక్నీషియన్ మహేందర్

తొగుట: తొగుట మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన బచ్చలి అనిత 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో అనితను సిద్దిపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో తొగుట వద్ద నొప్పులు ఎక్కువయ్యాయి. సిబ్బంది మహేందర్, రమేష్ వైద్య సహాయక చర్యలు చేపట్టగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలను సిద్దిపేట మాత శిశు ఆరోగ్య వైద్యశాలలో చేర్పించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: లయన్స్‌క్లబ్


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చేర్యాల: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పుర్మ వెంకట్‌రెడ్డి అన్నారు. 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వరకు నిర్వహించనున్న మీజిల్స్, రూబెల్లా వ్యాధినిరోధక టీకాల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9నెలల నుంచి 15సంవత్సరాలలోపున్న పిల్లలకు వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్మన్ శ్రీనివాస్, కార్యదర్శి కొక్కుల సురేందర్, కార్యదర్శి వీరబత్తిని సత్యనారాయణ, ప్రతినిధులు కందుకూరి ఉపేందర్, రమేష్, శ్రీనివాస్, రాములు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

చేర్యాల: ఏఐఎస్‌ఎఫ్ 82వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం చేర్యాలలో ఆ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యూనియన్ కార్యాలయంలో నాయకులు ముస్త్యాల గణేశ్, రామగళ్ల నరేశ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పోరాడుతున్న విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల కిరణ్‌కుమార్, గాజుల రాకేశ్, పుట్ట నవీన్, బాపురాజు, రాకేశ్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్

చేర్యాల: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా చేర్యాలకు చెందిన దాసరి ప్రశాంత్ నియామకమయ్యారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం చేర్యాలలో ప్రశాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతూ యూనియన్ పటిష్టతకు పాటు పడతానన్నారు.

గీతా పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

చేగుంట: మండల కేంద్రమైన చేగుంటలోని గీతా పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఒకరోజు ముందే విద్యార్థులు నిర్వహించారు. గీతా పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బాలబాలికలు కృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. అనంతరం విద్యార్థులు పోటీపడి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ హరికుమార్, కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, వైస్ ప్రిన్సిపాల్ దీనతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం, పెద్దచెరువుకు మహర్దశ

• ఎమ్మెల్యే రామలింగారెడ్డి


సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాక: దుబ్బాకలోని రామసముద్రం, పెద్దచెరువులను మినీట్యాంక్‌బండ్లుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి తెలిపారు. శనివారం దుబ్బాకలోని రామసముద్రం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దుబ్బాకను నందనవనంగా తీర్చిదిద్దుతామన్నారు. అందులో భాగంగానే రామసముద్రం చెరువు సుందరీకరణ చేపట్టామని, త్వరలోనే పనులను పూర్తిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ ఎల్లారెడ్డి, నాయకులు ఆస స్వామి, రమేష్, భూంరెడ్డి, రామస్వామి, వెంకటస్వామి, అంజిరెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, మల్లేశం తదితరులున్నారు.

కోదండరాం అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్, న్యూడెమోక్రసీ నేతలు

చేర్యాల: తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం తలపెట్టిన అమరవీరుల స్ఫూర్తియాత్రను అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం తగదని పేర్కొంటూ శనివారం చేర్యాలలో పీడీఎస్‌యూ, పీవైఎల్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అరాచకపాలన సాగిస్తూ ప్రశ్నించే గొంతును అణచివేయడం తగదన్నారు. కోదండరాంపై అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అందె అశోక్, కర్రె నర్సింహులు, నంగి మైసయ్య, చింతల నవీన్, అందె బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలను నాటి రక్షించాలి

• సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి



వలంటీర్లతో మొక్కలను నాటుతున్న ప్రిన్సిపాల్

మిరుదొడ్డి: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం అల్వాల్ గురుకుల పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం వల్ల వర్షాలు పుష్కలంగా కురుస్తాయన్నారు. పాఠశాలలో మొక్కలను నాటిన తర్వాత వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ వలంటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సంరక్షించుకోవాలి

• సర్పంచ్ కొరంపల్లి విజయలక్ష్మీవెంకట్‌రెడ్డి


రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహిస్తున్న నేతలు

మిరుదొడ్డి: ఆడపిల్లలు ఇంటికి అదృష్టలక్ష్మి అని మోతె సర్పంచ్ కొరంపల్లి విజయలక్ష్మీవెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం మోతె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీని నిర్వహించిన అనంతరం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల కోసం బేటీ బచావో, బేటీపడావో ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. దీని వల్ల ఆడపిల్లల భ్రూణహత్యలను నివారించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పిల్లల సంరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, స్వరూప, వెంకట్‌రెడ్డి, నర్సింలు, రాజేశ్వర్, సత్తయ్య, నర్సింలు, జెన్నారెడ్డి పాల్గొన్నారు.

'రైతులను మోసగిస్తూ భూములు లాక్కోవడం తగదు'

చేర్యాల టౌన్: ప్రాజెక్టుల నిర్మాణం పేరిట రైతులను మోసగిస్తూ భూములు లాక్కోవడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలను అమలుచేయకుండా ప్రభుత్వం మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణాలకు భూములు సేకరిస్తూ భూనిర్వాసితులను మోసం చేస్తుందన్నారు. నేరెళ్ల ఘటనపై ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం తగదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు రేవంత్‌కుమార్, కళావతి, భాస్కర్ పాల్గొన్నారు.


పోతిరెడ్డిపల్లిలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఐకేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛప్రతిజ్ఞ

• ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మాణంపై అవగాహన

చేర్యాల: ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని అవగాహన కల్పిస్తూ శనివారం చేర్యాల మండలంలోని ఆకునూరు, పోతిరెడ్డిపల్లి, చుంచనకోట గ్రామాల్లో ఐకేపీ వీవోఏల ఆధ్వర్యంలో స్వచ్ఛర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా బహిరంగ మల, మూత్రవిసర్జన గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కర్రెద్ల కౌసల్యమాధవరెడ్డి, ల్యాగల యాదగిరి, సూటిపల్లి బుచ్చిరెడ్డితోపాటు జడ్పీటీసీ సుంకరి సరిత, గ్రామైక్యసంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అచ్చంపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంపై విచారణ

వెల్దుర్తి: మండలంలోని అచ్చంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌గౌడ్ విద్యార్థులను కొడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జిల్లా విద్యాధికారి ఆదేశాలతో శనివారం మండల విద్యాధికారి యాదగిరి హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. గ్రామంలో విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి పిల్లలను, తల్లిదండ్రులను హెచ్‌ఎం పనితీరుపై విచారించారు. అలాగే సర్పంచ్ నర్సింలు కూడా హెచ్‌ఎం తీరుపై విచారణ చేశారు. విచారణ చేపట్టిన అంశాలను డీఈవోకు పంపుతామని తెలిపారు.

వధువుకు పుస్తె, మట్టెలు పంపిణీ

సిద్దిపేట మునిసిపాలిటీ: వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో శనివారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన పేద వధువు శ్రావ్య వివాహానికి పుస్తె, మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ సేవలు అందరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థుల ప్రయోజనం కోసం వ్యక్తిత్వ వికాస తరగతులను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్, బెజుగాం రమేశ్, శివకుమార్, రాజేందర్, క్యాస బాలయ్య, గంప కృష్ణమూర్తి, చంద్రకళ, జగదాంబ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.


వధువుకు పుస్తె, మట్టెలను అందజేస్తున్న వాసవీ, వనిత క్లబ్‌ల ప్రతినిధులు

భూమి సేకరించకుండా ప్రాజెక్టులు నిర్మిస్తారా?

- టీఆర్ఎస్ పుట్టిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసం
- ప్రతాప్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం
- సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట కల్చరల్: రైతాంగానికి సాగునీరందించేందుకు ప్రాజెక్టులు నిర్మించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్, టీడీపీ నేతలు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ఆరోపించారు. ప్రాజెక్టులు నిర్మించాలంటే భూసేకరణ తప్పనిసరి అని, భూసేకరణ చేయకుండా ప్రాజెక్టులు ఎలా నిర్మిస్తారని ప్రతి పక్షాలను ప్రశ్నించారు. గత పాలకులు ప్రాజెక్టులు కట్టకుండా కాలం వెల్లదీశారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, టీడీపీ నాయకులు భూసేకరణ చేయకుండానే ప్రాజెక్టులు నిర్మించారా అని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అభివృద్ధి కోసం కంకణ బద్ధులై ఉన్నారని ఆయన తెలిపారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కేసీఆర్ కృషి చేస్తుంటే టీడీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి అర్థరహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మాణానికి 4700 ఎకరాల భూమిని సేకరిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించి ప్రాజెక్టులు అడ్డుకోవడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్, ప్రభాకర్, శీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజనర్సు, కౌన్సిలర్లు


శంకరవ్వ భర్తను పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

బాధితులకు హరీశ్‌రావు పరామర్శ

సిద్దిపేట రూరల్: సిద్దిపేట మండలం చిన్నగుండవెల్లి గ్రామ వార్డు సభ్యుడు రాంచంద్రారెడ్డికి ఇటీవల బైక్‌పై నుంచి పడి గాయాలు కాగా శనివారం గ్రామంలో పర్యటించిన మంత్రికి విషయం తెలియడంతో వార్డుసభ్యుడి ఇంటికి వెళ్లి ఆతడిని పరామర్శించారు. అనంతరం గ్రామంలోని టీఆర్ఎస్ మహిళా కార్యకర్త శంకరవ్వ భర్త పక్షవాతంతో బాధపడుతున్నాడని తెలిసి అతడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మంత్రివెంట ఎంపీపీ యాదయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీహరి గౌడ్, సర్పంచ్ భూమయ్యగారి కిషన్‌రెడ్డి, నాయకులు బాలకిసన్‌రావు, తుపాకుల బాల్‌రంగం, మారెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆపత్కాలంలో అండగా ఉంటా

సిద్దిపేట కల్చరల్: ఆపత్కాలంలో అండగా ఉంటానని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలోని కలెక్టరేట్‌లో సిద్దిపేట నియోజకవర్గంలోని 18 మందికి రూ. 5.81 లక్షల చెక్కులను సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు కౌన్సిలర్ ఆనంద్, నాయకుల పాల్గొన్నారు.

రెడ్డి ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట జిల్లా తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక అంబిటాస్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ పుర్మ రాంరెడ్డి తెలిపారు. ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గోపాల్‌రెడ్డి, కన్వీనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డిని ఎన్నుకున్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

సిద్దిపేట అర్బన్: విద్యార్థులు క్రమం తప్పకుండా ఆటలాడడం వల్ల మానసిక ఉల్లాసం పొందడంతోపాటు ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రతిభ డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఆట దుస్తులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు. క్రీడల కోసం నిర్మించిన స్టేడియం సద్వినియోగ పరుచుకుని విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

సిద్దిపేట మున్సిపాలిటీ: స్థానిక మెదక్ రోడ్డులోని ఇందిరానగర్ కాలనీలో 13వ తేదీ నుంచి 17 వరకు నిర్వహించే పంచాహ్నిక దివాస ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో శివపంచాయతన నవగ్రహ సహిత పవనసుత పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవము నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 5 రోజుల్లో జలాదివాసము, పంచగవ్య, అధివాసం, ధాన్యాదివాసం, ఫల, పుష్ప శయ్యాదవాసం, చివరిరోజు విగ్రహ ప్రతిష్ఠతో పాటు, పూర్ణాహుతి, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

'స్థానిక సమస్యలపై స్పందించాలి'

సిద్దిపేట మున్సిపాలిటీ: ప్రతి కార్యకర్త తమ తమ వార్డుల్లోని సమస్యలపై స్పందించి, పరిష్కారమయ్యేవరకు పోరాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరోత్తంరెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ శాఖ సమావేశానికి హాజరై మాట్లాడారు. అందరూ క్రియాశీలకంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమారాణి, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పోరాటాలు

- ఏఐఎస్ఎఫ్ 82వ ఆవిర్భావ వేడుకల్లో సంఘం జిల్లా కార్యదర్శి మన్నె కుమార్

సిద్దిపేట అర్బన్: దేశంలోని మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, సంఘం స్థాపించిన నాటి నుంచి విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మన్నె కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 82వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సంఘం జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ప్రొఫెసర్ కోదండరాం సభ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులపై టీఆర్ఎస్ గుండాల దాడి అప్రజాస్వామికమని కుమార్, ఆ సంఘం అధ్యక్షుడు జనార్దన్ ధ్వజమెత్తారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు న్యాయం అడిగితే కిరాయి గుండాలతో కొట్టిస్తారా? అని ప్రశ్నించారు. దాడులకు ప్రతి దాడులు జరిగే పరిస్థితి వస్తుందన్నారు. ప్రజలే టీఆర్ఎస్ గుండాలను తిప్పికొడతారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, సుధాకర్, నాయకులు వర్మ, నవీన్, రాజు, వెంకటేశ్, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఆడపిల్ల దేవతా స్వరూపం: కౌన్సిలర్

సిద్దిపేట మునిసిపాలిటీ: ఆడపిల్ల దేవతా స్వరూపమని ఆరో వార్డు కౌన్సిలర్ బాల్‌లక్ష్మీఆనంద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆరో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ముందుంచాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లోని ఆడ పిల్లలందరికీ రాఖీలు కట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, మంజుల తదితరులు పాల్గొన్నారు. 34వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ బోనాల మంజులనర్సింలు బాలికలకు రాఖీలు కట్టారు. అనంతరం మాట్లాడుతూ ఆడపిల్లలను చిన్న చూపు చూడడం తగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, టీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


రాఖీ కడుతున్న కౌన్సిలర్ బాల్‌లక్ష్మీఆనంద్

శ్రీనివాస నగర్ సమస్యలపై విన్నపం

సిద్దిపేట మున్సిపాలిటీ: తమ కాలనీలో నెలకొన్న సమస్యలపై శ్రీనివాస నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ రమణాచారికి విన్నవించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గాదగోని లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ మురుగు నీటి పారుదల వ్యవస్థపై, ఫ్లోరైడ్ నీటి సమస్యపై, మిషన్ భగీరథ తదితర సమస్యలపై కమిషనర్‌ను సంప్రదించగా వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బుర్గోజు శ్రీహరి, కోశాధికారిగా పబ్బోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మంచాల ఎల్లయ్య, గ్యాదరి రాజారాం, సభ్యులుగా యాదగిరి గౌడ్, రమేష్, శ్రీనివాస్, రవి, రాజేశం, సర్రాజ్ అలం తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాదగిరి

నంగునూరు: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని, నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తున్నదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. శనివారం నంగునూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరుల స్ఫూర్తియాత్ర చేస్తున్న టీజేఏసీ చైర్మన్ కోదండరాంను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. అవినీతి అక్రమాలు పెరిగిపోయాయన్నారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసిన కోదండరాం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. సమావేశంలో శ్రీనివాస్, చెలికాని యాదగిరి, వేణు, దాసరి కిషన్, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులకే సబ్సిడీనా?

- టీడీపీ నాయకుల విమర్శ

నంగునూరు: అధికార పార్టీ నాయకులకే సబ్సిడీ పథకాలను మంజూరు చేయడంతో అర్హులకు తీరని అన్యాయం జరుగుతున్నదని టీడీపీ మండలాధ్యక్షుడు చెలికాని మల్లేశం ఆరోపించారు. శనివారం నంగునూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పేద రైతులే లేనట్లుగా సబ్సిడీ ట్రాక్టర్లు గులాబీ నేతలకే ఇచ్చారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నీటి మూటలుగానే మిగిలిపోయాయన్నారు. రెండేళ్ల క్రితం పంటలకు ఇన్సూరెన్స్ కట్టిన రైతులకు ఇంతవరకు నష్టపరిహారం అందలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పోశయ్య, సత్యనారాయణరెడ్డి, రాజు, సిద్ధయ్య పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

సిద్దిపేట కల్చరల్: పిల్లలు ఆరోగ్యం కోసం నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలని నాల్గో వార్డు షేర్‌పురం కౌన్సిలర్ దీప్తీనాగరాజు అన్నారు. శనివారం ఆ వార్డులోని అంగన్‌వాడీలో చిన్నారులకు నివారణ మాత్రలను ఆమె అందించారు. కార్యక్రమంలో సీడీపీవో స్వప్న, సూపర్‌వైజర్లు రాము, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకోడూరులో ఉచిత వైద్య శిబిరం

చిన్నకోడూరు: చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామంలో సర్పంచ్ సామల సునీత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జడ్పీటీసీ కమలారాంచంద్రం ప్రారంభించారు. మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు.



హుస్నాబాద్‌లో సినిమా

వెంకటేశ్వర
జయ జానకి నాయక

చిన్నారుల కప్పతల్లి ఆటలు



కప్పతల్లి ఆట ఆడుతున్న చిన్నారులు

కోహెడ: మండలంలోని సముద్రాల గ్రామంలో వర్షాలు కురువాలని కోరుతూ చిన్నారులు శనివారం కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా రోకలి బండకు కప్పను కట్టి ఇంటింటికి తిరుగుతు కప్పతల్లి ఆటలు ఆడారు. కప్పపై మహిళలు బిందెలతో నీరు పోస్తూ వర్షాలు కురువాలని కోరుకున్నారు.

పోతారం(ఎస్)లో ముగ్గుల పోటీలు

హుస్నాబాద్ రూరల్: మండలంలోని పోతారం(ఎస్)లో స్వశక్తి, స్త్రీశక్తి సంఘాల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15వ తేదీని పురస్కరించుకొని ఈ పో టీలు నిర్వహించినట్లు స్వశక్తి స్త్రీశక్తి మహి ళా సంఘం ప్రతినిధి బీ కనకతార పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, ఎంపీటీసీ అరవింద తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

బెజ్జంకి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పాకాల కాం తమ్మ ట్రస్టు అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రె డ్డి శనివారం 2వేల ఆర్థిక సహాయాన్ని అం దించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శ్రీని వాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం పొట్లపల్లి అధ్యక్షుడిగా సదాచారి

హుస్నాబాద్ రూరల్: విశ్వబ్రాహ్మణ సంఘం పొట్లపల్లి అధ్యక్షుడిగా సదాచారి ఎన్నికయ్యారు. శనివారం ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసాచారి, రాజనరిచారి ఆ ధ్వర్యంలో జరిగిన సంఘ సమావేశంలోనూ తన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ గౌర వ అధ్యక్షుడిగా సుదర్శనాచారి, అధ్యక్షుడిగా సదాచారి, ఉపాధ్యక్షుడిగా రవీంద్రాచారి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మాచారి, కోశాధికారిగా శ్రీధరాచారి, సహాయ కార్యదర్శిగా రాజయ్యాచారి, కార్యవర్గ సభ్యులుగా సదానందాచారి, వీరస్వామి, వెంకటస్వామి, రాజుచారి, లక్ష్మీనారాయణ, వీరయ్య ఎన్నిక య్యారు.

ఢిల్లీ ధర్నాను విజయవంతం చేయండి

హుస్నాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చే యాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం నిర్వహిస్తున్న అమరుల స్ఫూర్తి యాత్ర భగ్నం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోదాండరాం యాత్రకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. యాత్రను అడ్డుకునే టీఆర్ఎస్ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఢిల్లీ ధర్నాకు సీపీఐ జాతీ య కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి హాజ రవుతారన్నారు. సమావేశంలో నాయకులు మల్లేష్, సృజన్‌కుమార్, ఆలమల్లు, శ్రీధర్, సుదర్శానాచారి, సురేష్ పాల్గొన్నారు.

‘ఎన్ఎస్‌యూఐ’పై దాడి అమానుషం

అల్లాదుర్గం: జేఏసి ఛైర్మెన్ ప్రొఫేసర్ కోదండరాం తలపెట్టిన స్ఫూర్తి యాత్రకు మద్దతు తెలిపిన ఎన్ఎస్‌యూఐ విద్యార్థులపై దాడి చేయడం అత్యంత అమానుషమని ఎన్ఎస్‌యూఐ అల్లాదుర్గం,వట్‌పల్లి అధ్యక్షులు మహెష్,ఖాజాలు అన్నారు.ఈ దాడిని నిరసిస్తూ శనివారం స్థానికంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్ఫూర్తి యాత్రకు మద్దతు తెలుపుతూ వారి కార్యక్రమంలో పాల్గొంటున్న ఎన్ఎస్‌యూఐ విద్యార్థులపై లాఠీలు ఝళిపించడం, వారిని విచక్షణా రహితంగా కొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వికాస్, రజనీకాంత్, నిఖిల్, మనోజ్, దత్తు, పరమేశ్వర్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనపై అధికారులతో సమీక్ష

- రూ. 11.22 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్: ఈ నెల 14న హుస్నాబాద్ మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పీ మహేందర్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. మంత్రుల పర్యటన సందర్భంగా శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధి కారులతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రుల పర్యటన వివరాలను వెల్లడించారు. ఉదయం 10 గంటలకు మండలంలోని పందిల్ల గ్రామంలో రూ. 1,54 కోట్లతో నిర్మించే సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. ఎల్లమ్మ గుడి సమీపంలో రూ. 80లక్షలతో నిర్మించే రైతుబజార్, ఫిష్ మార్కెట్, మటన్ మార్కెట్లకు, రూ.1.43 కోట్లతో నిర్మించే సబ్‌స్టేషన్‌కు, రూ. 84లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. వీటితోపాటు మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీ వినోద్‌కుమార్, మండలి విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ రాజారెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ భూక్య మంగ, ఆర్డీఓ శంకర్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లింగాల సాయన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఆర్టీసీ డిపో అభివృద్ధిపై మంత్రికి విన్నవిస్తాం

హుస్నాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధి కోసం రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డికి విన్నవిస్తామని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ డిపోకు 20 ఎక్స్‌ప్రెస్ బస్సులు మంజూరు చేయాలని కోరుతానని తెలిపారు. హుస్నాబాద్ - హైదరాబాద్, హుస్నాబాద్-హన్మకొండ, సిద్దిపేటలకు డైరెక్ట్ బస్సులు వేయాలని మంత్రి దృష్టికి తీసుకపోతామన్నారు. సిద్దిపేట నుంచి హుస్నాబాద్‌కు రాత్రి 12గంటల వరకు కూడా బస్సులు ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతామన్నారు. అంతేకాకుండా హుస్నాబాద్‌లో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటవుతుందని, సోమవారమే ప్రారంభించే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. ముఖ్యంగా సంగారెడ్డి రీజియన్ కావడంతో ఈ డిపో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని కరీంనగర్ రిజియన్‌లో ఉంచాలని వ్యక్తపరిచామన్నారు. హుస్నాబాద్ బస్టాండ్ అధునీకరణతో ప్రయాణికులకు మంచి సౌకర్యాలు కలుగుతాయన్నారు. ఇక్కడి డిపో ఎత్తివేస్తారనే అపోహలు మానుకోవాలని ,ఇంకా అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన

- ఎమ్మెల్యే సతీష్‌కుమార్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కోహెడ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నా రు. శనివారం మండలంలోని వింజపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వింజపల్లిలో అభివృద్ధి జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యుల ర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలోఎంపీపీ స్వామి, జడ్పీటీసీ లక్ష్మణ్, టీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీహరి, దేవేందర్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ రవీందర్, సర్పంచులు పుష్పలత, వాణి, ఎంపీటీసీ మాధవి, నాయకలుఉ రజికాంత్‌రెడ్డి, మహేందర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

యువత క్రీడల్లో రాణించాలి

కోహెడ: గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి క్రీ డలు ఎంతగానో ఉపయోగపడతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాయిని నరోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఇందులో 13జట్లు పాల్గొన్నాయి. పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశం, నాయకులు శశిధర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సయ్య గౌడ్, బాలకిషన్, జగన్, సంపత్, దామోదర్, శ్రీనివాస్, ఆంజనేయులు, వెంకటాచారి, కమలాకర్‌రావు, రాంచందర్‌రెడ్డి, కరుణాకర్, సతీష్ పాల్గొన్నారు.

కొత్వాన్‌పల్లిలో దుస్తుల పంపిణి

రేగోడు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా దుస్తులు అందిస్తుందని కొత్వాన్‌పల్లి సర్పంచ్ రవీందర్ అన్నారు. శనివారం రేగోడు మండలంలోని కొత్వాన్‌పల్లి పాఠశాల విద్యార్థులకు దుస్తువుల పంపిణి చేశారు. ప్రభుత్వం కేజీ టూ పీజీ, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం లాంటి పథకాలు అమలు చేస్తుందని అన్నారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సృజన్‌కుమార్

హుస్నాబాద్ టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు ఆ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని అక్కన్నపేట చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేఖ విధానాలపై ఉద్యమించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు అయిలయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్, డివిజన్ నాయకులు ప్రసన్న, సాయిలు, సురేష్, పృథ్వీ, అజయ్, అక్షయ్, రవళి, రమ్య, సాయి ప్రసన్న, స్వప్న, బాబా, రజిత, తిరుమల పాల్గొన్నారు.



బెజ్జంకిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోహెడలో...

కోహెడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేఖ విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం కోహెడలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతపరమైన విధానాలు, టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేఖ విధానలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మధు, శేఖర్, ప్రసన్న, రూపేష్, సురేష్, శంకర్, కుమార్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యాపారాన్ని అరికట్టాలి

బెజ్జంకి: నాటి నుంచి నేటి వరకు విద్యార్థి ఉద్యమాల్లో ముందుంటూ ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విద్యకు వ్యతిరేఖంగా పోరాడుతు కామన్ విద్యా విధానం కోసం పోరాటాలు చేస్తున్న ఘనత ఏఐఎస్ఎఫ్‌దేనని ఆ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మధు అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా బెజ్జంకిలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం మధు మాట్లాడుతూ పాలకవర్గాలు కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నాయన్నారు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసం, సమాజ అభివృద్ధికి తోడ్పడాలే తప్ప విద్యపై పెట్టుబడులు పెట్టి విద్యను వ్యాపారం చేయడం బాధాకరమని అన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రూపేస్, ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవి, నాయకులు ధర్మారెడ్డి, రాకేష్, నవీన్, ప్రశాంత్, సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో సినిమాలు

సంతోష్	పిదా
యాదగిరి	నేనే రాజు నేనే మంత్రి
తూప్రాన్	
వెంకటేశ్వర	జయ జానకి నాయక

కృష్ణాష్టమి వేడుకలకు యాదవులు తరలిరావాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గణేశ్‌యాదవ్

ములుగు: ఈ నెల 14వ తేదీ సిద్దిపేట జిల్లా పుల్లూరులో నిర్వహించనున్న శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు యాదవులందరూ తరలిరావాలని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరం గణేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన ములుగులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లూరులో నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ములుగు మండలం నుంచి భారీ బైక్ ర్యాలీతో వెళ్లనున్నామని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు ఐలేశ్ యాదవ్, నాయకులు రవీందర్ యాదవ్, బాలు యాదవ్, శ్రీను యాదవ్ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బాల్‌రెడ్డి

ములుగు: మండలంలోని క్షీరసాగర్ గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకొని శనివారం నెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ పరిశీలన

కొండపాక: తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ మడుపు భూంరెడ్డి, కొండపాక మండల ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ రిజర్వాయర్ నుంచి మండలంలోని పలు చెరువులకు నీళ్లు మళ్లించడానికి కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్‌కు గోదావరి జలాలు వస్తుండడంతో చూడటానికి జనం వస్తున్నారు.

ఘనంగా ఎస్‌టీయూఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

గజ్వేల్ అర్బన్: జాతీయ ఉపాధ్యాయ సంఘం (స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గజ్వేల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌టీఎఫ్‌ఐ అనుబంధ సంఘమైన యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టీఎఫ్‌ఐ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనలో ఎస్‌టీఎఫ్‌ఐ కృషి గొప్పదని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు అనేక పోరాటాలను చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సక్రియ, నర్సింహ్మా, లక్ష్మీపతి, రాంచంద్రం, వెంకటకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టీఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రాజెక్టులపై ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం

• జీవీఎన్సీ చైర్మన్ భాస్కర్, టీఆర్ఎస్వీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న భాస్కర్, శ్రీనివాస్

గజ్వేల్ అర్బన్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని జీవీఎన్సీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ అన్నారు. గజ్వేల్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన శనివారం టీఆర్ఎస్వీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంపై అవగాహన లేని ప్రతిపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎకరం భూమి కూడా ముంపునకు గురికాకుండా 45వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీ పునరుజ్జీవ ప్రాజెక్టును చేపట్టారన్నారు. సీమాంధ్ర పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కోటి ఎకరాల మాగాణికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంటే కాంగ్రెస్, టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేస్తూ అడ్డు తగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణలో తుడిచిపెట్టుకుపోయిన పార్టీలు ఉనికి చాటుకోవడం కోసం అర్థరహిత ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. కామారెడ్డిలో కోదండరాం తరిమిన తరహాలోనే ప్రజలు ప్రతిపక్షాలకు కూడా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆకుల దేవేందర్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాల రమేశ్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, నిజాం, ఉమేర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను బతికించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్

కొండపాక: ఆడ పిల్లలని నిర్లక్ష్యం వీడి వారిని కాపాడుకుని మంచిగా చదివించుకుందామని కొండపాక మండలం దుద్దెడ సర్పంచ్ పెద్దొంకల శ్రీనివాస్ అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, పౌష్టికాహారం పొందాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్ని కృష్ణుని వేషధారణలో పిల్లలు ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టి సంబరాలు చేసు కున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూమవ్వ, అంగన్‌వాడీ టీచర్లు టి శోభారాణి, కనకలక్ష్మి, సుజాత బాల్ లక్ష్మి, నాయకులు ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తాం



మాట్లాడుతున్న బాలేశ్‌గౌడ్

గజ్వేల్ అర్బన్/రాయపోల్: 2019 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గ నాయకుడు అంబటి బాలేశ్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలో రాయపోల్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకట్‌గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం బాలేశ్‌గౌడ్ మాట్లాడుతూ 2019లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం: గాడిపల్లి భాస్కర్



వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న భాస్కర్

గజ్వేల్ అర్బన్: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జీవీఎన్సీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ అన్నారు. ప్రపంచ యువజన దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో యూత్ ఫర్ నేషన్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్ వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివేకానందుని బాటలో నడిచి యువత దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లో యువత రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎన్సీ వైస్ చైర్‌పర్సన్ దుంబాల అరుణ భూపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, దేవేందర్, కాంగ్రెస్ నాయకులు చాడ రామరాజుపంతులు, సర్దార్‌ఖాన్, ఎక్బాల్, లక్ష్మణ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అక్బర్, యువజన సంఘాల నాయకులు నర్సింలు, సాదక్ పాషా, సంతోష్, నరేశ్, వినోద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ వేడుకలు



సర్పంచ్ ఐలయ్యకు రాఖీ కడుతున్న చిన్నారి

జగదేవ్‌పూర్: మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సర్పంచ్ ఐలయ్య, ఎంపీటీసీ బింగి భాస్కర్‌కు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ దీపాంజలి పాల్గొన్నారు.

అచ్చంపేట హెచ్ఎంపై విచారణ

వెల్దుర్తి: మండలంలోని అచ్చంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్‌గౌడ్ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాడని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, డీఈవో ఆదేశాలతో శనివారం ఎంఈవో యాదగిరి హెచ్ఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. గ్రామంలో విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి పిల్లలను, తల్లిదండ్రులను హెచ్ఎం పనితీరుపై విచారించారు. అలాగే సర్పంచ్ నర్సింలు కూడా హెచ్ఎం తీరుపై విచారణ చేశారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్ అర్బన్: పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో శనివారం ఏఐఎస్ఎఫ్ 82వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కొండా రవి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం 82 సంవత్సరాలుగా ఏఐఎస్ఎఫ్ నిర్విరామ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, డివిజన్ కన్వీనర్ రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం యాత్రను అడ్డుకోవడం సరికాదు

ప్రొఫెసర్ కోదండరాం చేపట్టిన అమరుల స్ఫూర్తి యాత్రను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవి అన్నారు. కోదండరాం యాత్రను అడ్డుకోవడం, విద్యార్థి సంఘాలపై దాడిని ఖండిస్తూ శనివారం గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాల నాయకులపై భౌతిక దాడులు చేయడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థి సంఘాలకు క్షమాపణ చెప్పాలన్నారు.



నాటుకోడి కేరాఫ్ తిరుపతి

వారాంతం రాగానే నాలుక ప్రత్యేక రుచిని కోరుకుంటుంది. మాంసాహార ప్రియులైతే కోడిరుచులను ఆస్వాదించేది ఎప్పుడెప్పుడా అని తహతహలాడుతారు. చాలామంది నాటుకోడికే జై కొడతారు. నాటుకోడి పులుసు రుచికి ఏ కోడి సాటిరాదని నాన్‌వెజిటేరియన్స్ అభిప్రాయం. రుచి ఒక్కటే కాదు.. ఆరోగ్యాన్ని, రోగ నిరోధకశక్తిని పెంపొందించే మేటి గుణాలు ఇందులో ఉన్నాయని తెల్సుకున్న మాంసాహార ప్రియులు నాటుకోడిపై దృష్టి సారిస్తున్నారు. మంచి నాటుకోడి కావాలంటే మనం రేగొండ వెళ్లాల్సిందే. అక్కడ ఒక రైతు నాటుకోళ్లను పెంచుతూ లాభాల బాటలో పయనిస్తున్నారు. మంచి కోళ్లను వినియోగదారులకు అందిస్తున్నారు.

సండే స్పెషల్ Sunday Special



రేగొండలో రేండ్ల తిరుపతి పౌల్ట్రీ ఫాంలో రాజశ్రీ కోళ్లు

- రాజశ్రీ కోళ్ల పెంపకం చేపడుతున్న రైతు
- అక్కన్నపేట మండలం రేగోండలో కోళ్ల ఫాం ఏర్పాటు
- రాజేంద్రనగర్‌లోని పశువిశ్వవిద్యాలయం నుంచి కోడి పిల్లలను తెచ్చి పెంపకం
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి
- ఆదర్శంగా నిలుస్తున్న రేండ్ల తిరుపతి

అక్కన్నపేట: మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నాటుకోళ్లను పెంచితే అధిక లాభాలు సాధించొచ్చని భావించారు అక్కన్నపేట మండలం రేగొండ గ్రామానికి చెందిన రేండ్ల తిరుపతి. నాటుకోళ్ల పెంపకంలో అధిక లాభాలు గడిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రేండ్ల తిరుపతికి 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయంతో పాటు నాటుకోళ్లపై మక్కువతో నాటుకోళ్ల పౌల్ట్రీ ఫాం నిర్మించాడు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని పశువిశ్వవిద్యాలయం నుంచి రాజశ్రీ అనే కోళ్ల పిల్లలను రూ. 20 చొప్పున 500 కోడి పిల్లలను కొనుగోలు చేశాడు. వాటిని పౌల్ట్రీ ఫాంలో పెంచడం ప్రారంభించాడు. వాటి పెంపకం తీరు.. వచ్చే ఆదాయాన్ని ఆయన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటాల్లోనే..

'రాజేంద్రనగర్‌లోని పశువిశ్వవిద్యాలయం వారు నాటుకోడి పిల్లలకు దాణా ఇస్తారు. నాటుకోడి పిల్లలు దాణా తింటూ పౌల్ట్రీ ఫాం బయట తిరుగుతూ చిన్న చిన్న పురుగులు, లేత గడ్డి ఇతర ధాన్యాలను తింటుంటాయి. రాజశ్రీ అనే వెరైటీకి చెందిన నాటుకోళ్లకు రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. వీటికి ఎలాంటి రోగాలు రావు. దీంతో మందులు అసలు ఉపయోగించాల్సిన అవసరం లేదు. నాటుకోళ్లు అమ్మకానికి వచ్చే సరికి 4నెలల సమయం పడుతుంది. ఒక్కో నాటు కోడి కిలోన్నర వరకు వస్తుంది. 5 నెలల వరకు ఉంచితే రెండు కిలోల వరకు పెరుగుతుంది. తరువాత నాటు కోళ్లను పెంచినా గాని రెండు కిలోల కంటే ఎక్కువ పెరగదు. కాబట్టి 4 నెలల వరకే నాటు కోళ్లను అమ్మకానికి పెట్టాలి. కిలో రూ. 200 నుంచి రూ. 250 వరకు నాటుకోళ్లు అమ్మకానికి పోతాయి. ఒక్కో కోడి పిల్లకు 4 నెలల సమయం వరకు రూ. 100 నుంచి రూ. 110 వరకు ఖర్చు వస్తుంది. ఉదయం ఫారం బయట తిరుగుతూ రాత్రి వేళల్లో ఫారంలోకి వస్తుండటంతో ఇబ్బందులు లేకుండా ఉన్నాయి. నాటుకోళ్లకు పండగలప్పుడు విపరీతమైన గిరాకీ ఉంటుంది. తెచ్చిన నాటుకోళ్లలో 40 శాతంపైన పుంజులు వస్తుండటంతో వాటిని విక్రయించగా మెత్తం ఖర్చులు పోను, ఒక్కోకోడి మీద రూ. 200 నుంచి రూ. 300 వరకు లాభం వస్తుంది. మిగతా ఆడకోళ్లు గుడ్లు పెట్టడంతో వాటిపైన లాభాలు వస్తాయి. ఒక్కో గుడ్డు రూ. 6 నుంచి రూ. 8 ధర పలుకుతుంది. ఈ గుడ్లకు కూడా రుచి ఉండటంతో విపరీతమైన గిరాకీ ఉంటుంది. ఈ గుడ్లను రాజశ్రీ నాటుకోళ్లకు వేస్తే పిల్లలు చేయవు గాని ఇళ్లల్లో పెంచుకునే నాటుకోళ్లకు వేస్తే పిల్లలు చేస్తాయి. 500 నాటుకోడి పిల్లలను తెచ్చి పెంపకం చేస్తే అన్ని ఖర్చులు పోను రూ. లక్ష నుంచి రూ. లక్షా 50వేల వరకు ఆదాయం వస్తుంది. రెండు మార్లు 500 కోడి పిల్లల చొప్పున పెంపకం చేస్తే రెండు లక్షల వరకు ఆదాయం వచ్చింది. వ్యవసాయంతో పాటు నాటుకోళ్ల పెంపకంతో మంచి లాభాలు గడిస్తున్నా. 4 నెలలకు చొప్పున కోళ్ల బ్యాచ్‌లను మారుస్తు ఉంటాం. ఈ ప్రాంతంలో నాటు కోళ్లకు భలే గిరాకీ ఉంటుంది. దీంతో మంచి లాభాలు గడిస్తున్నా.' అని రైతు రేండ్ల తిరుపతి తెలిపారు.



రేండ్ల తిరుపతి, రేగొండ గ్రామం, అక్కన్నపేట మండలం







విత్తనాల మెత్తు గుల్లలు, అవార్డులతో అంజమ్మ



విత్తనాలు నిల్వ చేసేందుకు సిద్ధం చేస్తున్న పిస్తాపూర్ తుల్జమ్మ

రేపటి విత్తుల ఖజానా

- సంప్రదాయ విత్తనాలకు కేరాఫ్.. ఈ అమ్మలు
- సహజ పద్ధతులతో సంరక్షణ
- హైబ్రిడ్‌కు దూరం.. చీడపీడలకు చెక్
- జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న మహిళామణులు

వ్యవసాయంలో పాత పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సులభంగా సాధించొచ్చు. అప్పట్లో రైతులు విత్తనాల ఎంపిక విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకునేవారు. వాటిని ఈ తరం వారు పాటించే ఓపిక లేక రెడీమేడ్ విత్తనాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఇక వీటిని విత్తితే పొలంలో ఒక్కోసారి మొలకలు కూడా రావు. కానీ ఇప్పటికీ కొందరు మహిళా రైతులు సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. పంట రాగానే మళ్లీ సాగు కోసం విత్తనాలను భద్రపరుస్తున్నారు. వాటిని విత్తి.. సేంద్రియ విధానంలో పంటల సాగు చేస్తుండడంతో లాభాల బాటలో పయనిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

జహీరాబాద్: ఎన్నో ఏళ్లుగా వివిధ రకాల పంట విత్తనాలను సంరక్షిస్తూ సంప్రదాయ పద్ధతిలో నిల్వ చేస్తున్న విధానం ఆధునిక టెక్నాలజీని సవాలు చేస్తుంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా వ్యవసాయంలో నూతన ఆధునిక పద్ధతులదే పైచేయి అయినా కొన్ని విషయాల్లో మాత్రం పాతపద్ధతులను అనుసరిస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం చాలామంది రైతులు వివిధ రకాల పంటల సాగుకు విత్తన కంపెనీలు అందించే విత్తనాల వైపే మొగ్గుచూపుతున్నారు. విత్తనాలను నిల్వ ఉంచే పద్ధతులను పాటించే ఓపిక లేక నాసి రకం విత్తనాల బారినపడి నష్టపోతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి అప్పుల పాలవుతున్నారు. జహీరాబాద్ డివిజన్ ప్రాంతంలో వర్షాధారంగా వివిధ రకాల సంప్రదాయ పంటలు పండడానికి అనుకూలంగా ఉన్న భూములే ఎక్కువగా ఉన్నాయి. వెనకటి రోజుల్లో రైతులు ఖరీఫ్, రబీ పంటలుగా రెండు సీజన్ల వారిగా వివిధ రకాల పంటలను సాగు చేసేవారు. ఖరీఫ్‌లో దాదాపుగా 30 నుంచి 40రకాల పంటలను పండిచేవారు. రబీలో అదేస్థాయిలో వివిధ రకాల పంటలను సాగు చేసేవారు. ఆ పంటల ద్వారానే విత్తనాలను సేకరించి సంప్రదాయ పద్ధతిలో నిల్వ ఉంచడంతో ఆ విత్తనాలకు ఎలాంటి చీడపీడలు ఆశించేవి కావు. అప్పట్లో ప్రతి ఇంటా పంటలు చేతికి రాగానే అందులోని బలమైన గింజలను సేకరించిన తర్వాత బాగా ఆరబెట్టి పేడతో అలికిన గంపలలో బుడిద, వేపాకు వేసి విత్తనపు గింజలను ఆ గంపల్లో ఉంచి మట్టి, పేడతో మూసి భద్రపర్చేవారు. ఖరీఫ్ సీజన్ రాగానే ఖరీఫ్ పంట విత్తనాలను, రబీ సీజన్ రాగానే రబీ పంట విత్తనాల గంపలను తెరిచేవారు. పంటలకు ఎలాంటి రసాయన ఎరువులుగాని, క్రిమిసంహార మందులనుగాని వాడేవారు కాదు. ఇప్పటికీ జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో కొందరు మహిళా రైతులు విత్తనాలను నిల్వ చేస్తూ సంరక్షిస్తూ వస్తున్నారు. ఈ విధానాన్ని ఆచరిస్తుండడంతో వారికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. విత్తనాలను ఎలా భద్రపరుస్తున్నారో వారి మాటల్లోనే..

విత్తన సంరక్షణే గాలిమోటారు ఎక్కించింది



మా పెద్దల కాలం నుంచి అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలనే మేము కూడా ఆచరిస్తూ వస్తున్నాం. నాకున్న భూమిలో ఇద్దరు కొడుకులకు మూడు ఎకరాల చొప్పున పంచి ఇచ్చాను. మిగతా మూడు ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నాను. ప్రస్తుతం మా ఇంటిలో సుమారు 50రకాల విత్తనాలను సంరక్షిస్తున్నాను. పేడతో అలికిన గంపలో ఎండించిన (ఎండలో బాగా ఆరబెట్టిన) విత్తనాలకు బూడిద కలిపి వేపాకులు పైన వేసి మట్టితో గంపను (ప్యాక్) మూసివేస్తాం. గంప పై భాగంలో పేడ, మట్టితో నీళ్ల పోసి అలుకుతాం. ఒకొక్క పంటకు సంబంధించి నాలుగైదు విత్తన రకాలు ఉంటాయి. ఖరీఫ్‌లో వేసే జొన్న పంటలో తోకజొన్న, బుడ్డజొన్న, ఎర్రజొన్న, తెల్లజొన్న అనే రకాలు ఉంటాయి. పెసరలో కిడికి, గంగ, తీగ పెసర తదితరాలు ఉంటాయి. ఖరీఫ్‌లో ఇచ్చే విత్తనాలకు బదులుగా ఒకటికి రెండింతలు (నాగు పద్ధతిలో) విత్తనాలను పంటలు పండించిన తరువాత తిరిగి ఇస్తారు. రబీలో ఒకటికి ఒకటిన్నర (దీడి పద్ధతిలో) విత్తనాలు ఇస్తారు. ఈ విత్తనాల సంరక్షణే నన్ను మూడు సార్లు గాలిమోటారు (విమానం)ను ఎక్కించింది. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. బీహార్, ఉత్తరప్రదేశ్, న్యూఢిల్లీ తదితర ప్రాంతాలకు గాలిమోటారులో వెళ్లాను. ప్రభుత్వపరంగా ఎన్నో అవార్డులు లభించాయి. ముఖ్యనేతలు, అధికారులను కలిశాను.

-నడిమిదొడ్డి అంజమ్మ, గంగ్వార్

పెద్దల సంప్రదాయాన్ని పాటిస్తున్నా



నేను మా అత్తమామలు వ్యవసాయంలో పాటించిన విధానాలనే ఇప్పటికే అనురిస్తున్నా. బహుళజాతి కంపెనీ (హైబ్రిడ్) విత్తనాలు మాకు తెలియవు. సంప్రదాయ విత్తనాలు ఆశించిన దిగుబడులను అందిస్తున్నాయి. ఖరీఫ్, రబీలకు సంబంధించి ఎర్ర, తెల్ల కొర్రలు, చిన్న, పెద్ద మినుములు, తెల్ల, ఎర్ర కందులు, నల్ల, తెల్ల అనుములు, ఎర్ర, తెల్ల పుండ్లు (గోంగూర విత్తనాలు), తైదలు, తెల్ల, నల్ల ఉల్వాలు, నువ్వులు, సజ్జలు, గడ్డినువ్వులు, సామలు, అరకలు తదితర 60రకాల విత్తనాలు నిల్వ చేస్తున్నా. ఒక్కొక్క రకం విత్తనం సుమారు 25 నుంచి 40కిలోల వరకు నిల్వ చేస్తున్నాను. అవసరమున్న రైతులకు కూడా ఆయా రకాల విత్తనాలు అందిస్తున్నా. నాకున్న కొద్ది పాటి పొలంలో ఎక్కువగా మిశ్రమంగా చిరుధాన్యాల పంటలను పండిస్తున్నాం. వర్షాధారంగా పండించే ఈ పంటలు తమను ఆదుకుంటున్నాయి.

-లక్ష్మమ్మ, హుమ్నాపూర్

వరుసకు ఒక్కొక్క రకం విత్తనం సాగు



నాకున్న మూడెకరాల పొలంలో వరుసల (సాళ్లు) వారీగా విత్తనాలు వేస్తున్నాం. ఒక్కొక్క వరుసలో ఒక్కో రకం విత్తనం వేస్తాం. జొన్న సాలు పక్కకు కంది, పెసర, మినుము విత్తనాలు వేస్తాం. అన్ని రకాల పంటలు మా పొలంలో పండే విధంగా చూస్తాం. ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి 40రకాల సంప్రదాయ విత్తనాలే సాగు చేస్తున్నాం. సాగు చేసిన పంటలకు క్రిమిసంహారక, రసాయన ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువులు, స్థానిక వనరులతో తయారు చేసిన కషాయాలను వాడుతున్నాం. తక్కువ పెట్టుబడితో వివిధ రకాల పంటలను పండిస్తు అధిక దిగుబడులు సాధిస్తున్నాం. నా కుమారులకు కూడా ఇవే పంటలు సాగు చేయాలని సూచిస్తున్నాం.

-చంద్రమ్మ, బిడకన్నె

విత్తనాలే మూలం



పొలంలో సాగు చేసిన పంటలు బలంగా ఎదగాలంటే మంచి విత్తనాలు అవసరం. విత్తనాలను తగు పద్ధతిలో నిల్వ ఉంచితే పురుగులు ఆశించకుండా ఉంటాయి. విత్తనాలను సేకరించేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తాను. జొన్న, కొర్ర, శనగ, కంది తదితర పంటల చేతికి వచ్చిన సమయంలో బలమైన గింజలను ఏరి నిల్వ చేస్తా. బలమైన గింజల విత్తనాలే బలమైన మొక్కలుగా పుట్టి పంట పుష్టిగా ఎదిగి అధిక దిగుబడులను ఇస్తుంది. నాకున్న మూడెకరాల పొలంలో కంది, పెసర, మినుము, అనుము, తైద, ఉల్వ పంటలను వేశాను. వచ్చే రబీ సీజన్ కోసం విత్తనాలు సిద్ధంగా ఉంచాను. రబీలో శనగ, సాయిజొన్న(మంచిజొన్న), తెల్ల కుసుమ, అవిశలు సాగు చేస్తాను.

-రంగమ్మ, ఖాసీంపూర్

పంటలు బాగా పండుతాయి



మంచి విత్తనాలు పొలంలో సాగు చేసుకుంటే పంటలు బాగా పండుతాయి. మేము పండించే పంటల నుంచే విత్తనాలను సేకరించి నిల్వ చేస్తాం. విత్తనాలను నిల్వ చేసే ముందు మూడు రోజులు బాగా ఎండబెడుతాం. పేడతో అలికిన గంపలు, గుమ్ములలో బూడిద కలిపిన విత్తనాలను వేసి పదరుపదరుగా వేపాకులు వేసి మెత్తు వేస్తాం. ఖరీఫ్, రబీ సీజన్లలో ఆ విత్తనాలతో పంటలను సాగు చేసుకుంటాం. విత్తనాలను వేరే రైతులకు ఇచ్చినప్పుడు వారు శనగలు మినహా అన్ని రకాల విత్తనాలు ఒకటికి రెండింతలు తిరిగి ఇస్తారు. శనగలు మాత్రం ఒకటికి ఒకటిన్నర ఎత్తు తిరిగి ఇస్తారు. నాకున్న 8ఎకరాలలో చిరుధాన్యాల పంటలైన పెసర, మినుము, జొన్న, కొర్ర, గడ్డినువ్వులు సాగు చేశాను.

-తుల్జమ్మ, పస్తాపూర్

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్ కుమార్

నియామకం

ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపర్ణ

గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారిణి, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ప్రిన్సిపల్ సెక్రటరీ అపర్ణ ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అపర్ణ మూడేళ్లు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రపంచ బ్యాంకులో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక దేశాలకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు.

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్ కుమార్



నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా ప్రముఖ ఆర్థికవేత్త రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. 2015 జనవరి నుంచి వైస్ ఛైర్మన్‌గా సేవలందించిన అరవింద్ పనగడియా రాజీనామా చేయడంతో రాజీవ్‌ను ఆ స్థానంలో నియమించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన రాజీవ్ వివిధ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఫిక్కీ సెక్రటరీ జనరల్‌గా, సీఐఐ ముఖ్య ఆర్థిక సలహాదారుగా సేవలందించారు. పరిశ్రమలు, ఆర్థిక మంత్రిత్వశాఖల్లో, ఆసియా అభివృద్ధి బ్యాంకులో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2006 నుంచి 2008 మధ్య నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. రాజీవ్ కుమార్‌తో పాటు ఎయిమ్స్ వైద్యుడు వినోద్ పాల్‌ను కూడా నీతి ఆయోగ్ సభ్యుడిగా కేంద్రం నియమించింది.

45వ సీజేగా దీపక్ మిశ్రా

సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత సీజే జస్టిస్ జగదీష్ ఖేహర్ ఆగస్టు 27న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో దీపక్ మిశ్రా బాధ్యతలు చేపడతారు. మిశ్రా 2018 అక్టోబరు 3 వరకు పదవిలో ఉంటారు. 1990-91లో సుప్రీంకోర్టు 21వ ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన రంగనాథ్ మిశ్రా మేనల్లుడే దీపక్ మిశ్రా. దీపక్ గతంలో పట్నా, ఢిల్లీ హైకోర్టు సీజేగా సేవలందించారు.

ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణం

భారత 13వ ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆగస్టు 11న ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్‌హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఆగస్టు 6న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీపై వెంకయ్య విజయం సాధించారు. ఏపీ నుంచి ఉపరాష్ట్రపతి పదవి అలంకరించిన మూడో వ్యక్తి వెంకయ్యనాయుడు. గతంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరి. ఉపరాష్ట్రపతిగా ఎన్నికై రాష్ట్రపతి అయ్యారు.

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

తొలి ప్రైవేట్ క్షిపణి తయారీ

దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్ రంగంలో క్షిపణి విడిభాగాల తయారీ సంస్థ 'కళ్యాణి-రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్'ను ఆగస్టు 3న హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌కు చెందిన కళ్యాణి గ్రూప్, ఇజ్రాయెల్‌కి చెందిన రఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ సంయుక్తంగా ఈ పరిశ్రమను హార్డ్‌వేర్ పార్కులో ఏర్పాటు చేశాయి. రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులకు అనుమతి లభించడంతో కళ్యాణి గ్రూప్ 51 శాతం, రఫెల్ 49 శాతం వాటాతో ఈ ప్రాజెక్టు చేపట్టాయి. ఈ కర్మాగారంలో రిమోట్ ఆయుధాలను, యాంటీ ట్యాంక్ మిస్సైల్స్‌ను, అత్యాధునిక క్షిపణి వ్యవస్థ పరికరాలను తయారు చేయనున్నారు.

అవార్డులు

గోరటి వెంకన్న, సుద్దాలకు 'జాలాది'

సినీ రచయిత జాలాది జయంతిని పురస్కరించుకొని విశాఖలో ఆగస్టు 9న జాలాది జాతీయ పురస్కారాలను అందజేశారు. ప్రజాకవి గోరటి వెంకన్నకు జాలాది జీవితకాల సాఫల్య పురస్కారం, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు జాలాది జాతీయ పురస్కారం అందించారు. ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు అవార్డులను అందజేశారు. జాలాది రాజారావు 1500కి పైగా సినీ గేయాలు రాశారు. గుడివాడలో జన్మించిన జాలాది ఎక్కువగా జానపద గేయాలను రచించారు.

భారత డిజిటల్ గ్రంథాలయ యాప్‌కి 'గ్లోబల్'

జాతీయ డిజిటల్ గ్రంథాలయ యాప్‌కు 'ఎంబిలియంత్ దక్షిణాసియా-2017' అవార్డు దక్కింది. అభ్యసనం, విద్య విభాగంలో విద్య సంబంధ అభివృద్ధిలో మొబైల్ యాప్ ఆధారిత ఆవిష్కరణకుగానూ ఈ అవార్డు లభించింది. ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ యాప్‌ను రూపొందించగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదించింది. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం భారతీయ భాషల్లో విద్య విషయ, బోధన అంశాలు అందరికీ అందుబాటులో ఉంచాలన్నదే ఈ డిజిటల్ గ్రంథాలయం ప్రధాన లక్ష్యం. ఈ డిజిటల్ గ్రంథాలయ యాప్‌లో కోటికి పైగా విషయాంశాలు 200 భాషల్లో అందుబాటులో ఉన్నాయి.

దేవ్ పటేల్‌కి 'ఏషియన్ గేమ్ చేంజర్స్'



స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్ర నటుడు దేవ్ పటేల్ 'ఏషియన్ గేమ్ చేంజర్స్ అవార్డు-2017'కి ఎంపికయ్యారు. దేవ్ లయన్ హార్ట్ ప్రచారం ద్వారా దేశంలోని ఇల్లులేని చిన్నారుల కోసం 2.5 లక్షల డాలర్ల నిధులను సేకరించారు. పేద పిల్లల సంక్షేమం కోసం దేవ్ చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది. ఆగాఖాన్‌కు లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు లభించింది. తదాషి యనాయ్, నుర్గేవ్, సొనిటా అలిజాదేలకు కూడా గేమ్‌చేంజర్స్ అవార్డు దక్కింది. 2017 నవంబరు 1న ఐక్యరాజ్య సమితి వీరికి అవార్డులను ప్రదానం చేస్తుంది.

క్రీడలు

పరుగుకు బోల్ట్ వీడ్కోలు



దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ తన చివరి వంద మీటర్ల పరుగును కాంస్యంతో ముగించాడు. లండన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో బోల్ట్ 9.95 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. అమెరికాకు చెందిన జస్టిన్ గాట్లిన్ 9.92 సెకన్లతో రేసు పూర్తిచేసి స్వర్ణం గెలుచుకొన్నాడు. మరో అథ్లెట్ కోల్‌మన్ 9.94 సెకన్లతో రజతం సాధించాడు. 100మీ. 9.58 సెకన్లు, 200మీ. 19.19 సెకన్లతో బోల్టు రికార్డులను నెలకొల్పాడు. 2008, 2012, 2016లో వరుసగా మూడు సార్లు 100మీ., 200మీ. పరుగులో స్వర్ణాలు గెలిచిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 8 ఒలింపిక్ పసిడి పతకాలను సొంతం చేసుకొన్నాడు. 11 సార్లు ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచాడు.

టెస్టుల్లో నెంబర్‌వన్ బౌలర్ జడేజా

